RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




08 నవంబర్ 2024 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:135



# ప్రజాబలం

08 నవంబర్ 2024 శుక్రవారం


## శ్వేతసౌధంలోకి ట్రంప్ పునరాగమనం

కమలా హారిస్ ఓటమితో అమెరికా రాజకీయాల్లో మహిళల స్థానం ప్రశ్నార్థకంగా మారింది. హిల్లరీ క్లింటన్‌ను నిరాదరించిన తరహాలోనే కమలా హారిస్‌ను కూడా అమెరికా పౌరులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. శ్వేతసౌధంలోకి మరోమారు డోనాల్డ్ ట్రంప్ అడుగుపెట్టబోతున్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే సంవత్సరం జనవరి నెలలో పదవీ స్వీకార ప్రమాణం చేయబోతున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలంటే కేవలం ఆ దేశ ప్రజలకే కాదు ప్రపంచానికే ఎన్నికలనే అభిప్రాయం ప్రబలిపోయింది. సోవియట్ రష్యా పతనం తర్వాత ప్రచ్ఛన్న యుద్ధం సమసిపోయింది. ద్విధ్రువ ప్రపంచం అదృశ్యమై, అమెరికా సారథ్యంలో ప్రపంచాన్ని ఒంటిచేత్తో నడిపే ఏకధ్రువ ప్రపంచం ఆవిర్భవించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యం అంతరించింది. అమెరికా, సోవియట్ రష్యాలు ప్రపంచాన్ని శాసించే శక్తులుగా ఎదిగాయి. ఇరుదేశాల యుద్ధోన్మాద చర్యలకు ప్రపంచం భీతిల్లిపోయింది. ఇరుదేశాల మధ్య అర్ధ శతాబ్దం కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం 'సోవియట్ యూనియన్' విచ్ఛిన్నంతో అంతమైపోయింది. ఉత్థాన పతనాలు ప్రపంచ రాజకీయ చరిత్రలో కొత్తేమీ కాదు. వింతేమీ లేదు. ఎగిరిపడే కెరటాలు సైతం వెనుదిరగక తప్పదు. సునామీ సైతం సద్దుమణగక తప్పదు. అదే తరహాలో బలవంతులమని విర్రవీగే దేశాలెన్నో బలహీన దేశాల చెంత పాదాక్రాంతమైన సంఘటనలెన్నో జరిగాయి. ఇలాంటి పరిణామాల వలన ఎన్నో సంపన్న దేశాలు పేద దేశాలుగా, పేద దేశాలు ధనిక దేశాలుగా ఆవిర్భవించాయి. అమెరికా కూడా ఎన్నో రాజకీయ, సామాజిక పరిణామాల అనంతరం అగ్రరాజ్యంగా అవతరించింది. సోవియట్ పతనం తర్వాత కూడా అమెరికా తన అగ్రరాజ్య హోదాను కాపాడుకోవడానికి ఎన్నో తంటాలు పడుతున్నది. బెదిరే దేశాలను తన పాదాక్రాంతం చేసుకుని, బెదరని దేశాలను భయపెట్టి ప్రపంచానికి పెద్దన్నగా చెలామణి అవుతున్నది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటైన అమెరికాలో జరిగిన ఎన్నికలు ఎంతో ఉత్కంఠతను కలిగించాలి. ప్రపంచమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా ఎదురుచూసింది. ప్రపంచాన్ని తన కనుసన్నలతో శాసించే పెద్దన్న తీసుకునే నిర్ణయాలపై ప్రపంచ భవితవ్యం ఆధారపడి ఉండడమే దీనికి కారణం. ఇప్పటి వరకు ఎన్నో పర్యాయాలు అమెరికాలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఎంతో మంది ప్రముఖులు అమెరికా అధ్యక్ష పీఠాన్ని అలంకరించి, అగ్రరాజ్యహోదాను నిలబెట్టారు. గతంలో నాలుగు సంవత్సరాలు అమెరికాను పాలించిన డోనాల్డ్ ట్రంప్ వలన అమెరికా ప్రతిష్ఠ మసకబారింది. అగ్రరాజ్యమనే గౌరవ భావన అడుగంటింది. ట్రంప్ చేష్టలతో ప్రపంచం బిత్తరబోయింది. మెక్సికో గోడ పేరుతో ట్రంప్ చేసిన హడావిడి అంతాఇంతా కాదు. 'నా దేశం– నా ప్రజలు' అనే భావన ప్రతీ దేశానికి, ప్రతీ పౌరుడికి, ప్రతీ ప్రభుత్వాధినేతకు ఉండడం సహజం. ఇది కాదనలేని సత్యం. ఇతర దేశాల విషయం ప్రక్కనబెడితే, పెద్దన్నగా ప్రపంచాన్ని శాసించాలని నిరంతరం వ్యూహాలు పన్నే అమెరికా విషయంలో 'తన దేశం– తన ప్రజలు' అనే సంకుచితమైన అభిప్రాయం అంకురించడం అగ్రరాజ్యాధి పత్యానికి తిలోదకాలివ్వడమే. తన పరిపాలనలో ఇదే విధానం కొనసాగించి, అమెరికా ప్రజల్లో శ్వేత జాతీయులు, నల్లజాతీయులనే భేదభావం ప్రదర్శించి జాత్యహంకార బీజాలు నాటిన ట్రంప్ వల్ల అమెరికన్లలో వ్యతిరేక ధోరణి ప్రబలింది. పార్టీలపరంగా, జాతులపరంగా దేశాన్ని రెండుగా చీల్చడానికి ట్రంప్ చేసిన ప్రయత్నాల వలన డెమొక్రాట్లు అధికారంలోకి రావడం జరిగింది. గత ఎన్నికల్లో అధ్యక్ష పీఠానికి దూరమైన ట్రంప్ మళ్లీ శ్వేతసౌధంలో విహరించబోతున్నారు. ట్రంప్ వలసవాదుల పట్ల, విదేశీయులకు వీసాల మంజూరులో గతంలో వ్యవహరించిన తీరుపట్ల అనేక మంది ప్రతిభావంతులు అమెరికా చదువులకు, ఉద్యోగాలకు దూరమైనారు. ఇదే వైఖరి ఇప్పుడు కూడా కొనసాగిస్తారా? లేక గత వైఖరికి భిన్నంగా వ్యవహరించి, మారిన మనిషిగా వలసవాదుల మనోభిప్రాయాలను మన్నించి, వారి గౌరవాభిమానాలకు పాత్రుడవుతారా? అనే విషయం త్వరలోనో స్పష్టమవుతుంది. ప్రపంచ దేశాలన్నీ ఇతర దేశాలతో ఆర్థిక, వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఏ ఒక్క దేశం గిరిగీసుకుని మనుగడ సాగించలేదు. ఒక దేశానికి, మరో దేశానికి వైద్య, సాంకేతిక, ఉద్యోగపరమైన అవసరాల దృష్ట్యా, ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవసరం. ప్రస్తుత ఆర్థిక అవసరాల రీత్యా ప్రపంచీకరణ వలన ఏ దేశమైనా ఇతర దేశాలతో సఖ్యతగా మెలగాలి. గిరిగీసుకుని ఒంటరిగా బ్రతికే రోజులు పోయాయి.మరోమారు అమెరికా అధ్యక్షునిగా జనవరి 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న ట్రంప్ ముందు అనేక సవాళ్ళులున్నాయి. ఎన్నో బాధ్యతలు, బరువులు ట్రంప్ కోసం ఎదురు చూపులు చూస్తున్నాయి. గతంలో ట్రంప్ అనుసరించిన విధానాలపై సమీక్ష జరగాలి. వలసదారులకు అన్ని దారులు మూసి వేయడానికి, అమెరికా జాతీయులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి గతంలో ట్రంప్ ప్రభుత్వం వీసాల జారీలో తెంపరితనం ప్రదర్శించింది. హెచ్ 1బి వీసాల విషయంలో ట్రంప్ నిర్ణయాలు అమెరికాలో విద్య, ఉద్యోగావకాశాల కోసం పోటీపడిన అనేక మంది విదేశీ ప్రతిభావంతులకు నిరుత్సాహం కలిగించాయి. వీసాల విషయంలో కూడా నిబంధనలు విధించడం వలన అమెరికావాసులకు ఎలాంటి ప్రయోజనం సిద్ధించలేదు. వీసాల మంజూరు విషయంలో అమెరికా వైఖరి వలన భారత్ టెకీలు నష్టపోయిన మాట వాస్తవం. అయితే ట్రంప్ గత పాలనకు విరుద్ధంగా పరిపాలన సాగిస్తారా? లేదా అదే విధానం కొనసాగిస్తారా? అనే సందిగ్ధం కొనసాగుతున్నది. అమెరికా అభివృద్ధిలో విదేశీ ప్రతిభ ప్రధాన భూమిక పోషిస్తున్న నేపథ్యంలో విదేశీయులను కాదని అమెరికా అభివృద్ధి సాధించలేదు. గత ట్రంప్ పాలన భారతీయుల ప్రతిభకు అణగదొక్కింది. అభివృద్ధికి శరాఘాతంలా మారింది. చైనాపై అక్కసుతో భారత్‌పట్ల ట్రంప్ సానుకూల వైఖరి ప్రదర్శించే అవకాశముంది. చైనాపై అమెరికా తన 'ట్రేడ్ వార్' లో భాగంగా భారత్‌కు అనుకూలంగానే ప్రవర్తించడం భారత్ పై కయ్యానికి సై అంటూ కాలు దూసే చైనా దూకుడుకు ఒక రకంగా కళ్ళెం వేయగలదు. ట్రంప్ పునరాగమనంతో భారత్ కు మేలు జరుగుతుందా? భారత దేశానికి ఇబ్బంది కలుగని రీతిలో చైనాతో సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం వలన భారత దేశానికి నష్టమేమీలేకపోవచ్చు. అయినా చైనాతో ట్రంప్ సఖ్యంగా మెలిగే అవకాశాలు లేవనే చెప్పాలి. ట్రంప్ తెంపరితనం ప్రపంచానికి కొత్త సమస్యలు తలెత్తవచ్చు. చైనాతో ట్రంప్‌కున్న విభేదాల కారణంగా భారత్‌కు మేలు జరిగే అవకాశాలున్నాయి. తనకు పక్కలో బల్లెంలా తయారవుతున్న చైనాను నిలువరించకపోతే అమెరికా అస్తిత్వానికే ముప్పు. ఈ విషయం అమెరికా పాలకులకు తెలియనిది కాదు. ఎవరు శ్వేతసౌధంలోకి అడుగుపెట్టినా తమ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ఇతర దేశాల ఎదుగుదలకు సహకరిస్తారనుకోవడం కేవలం భ్రమ మాత్రమే కాగలదు. పెద్దన్న పాత్రను వదులుకోవడానికి అమెరికా ససేమిరా ఒప్పుకోదు. ఇతర దేశాల అభివృద్ధిని తట్టుకోలేదు. రిపబ్లికన్ల పాలనలోను, డెమొక్రాట్ల పాలనలోను ఇప్పటి వరకు జరిగిన తంతు ఇదే. అమెరికా రథసారథ్యం వహించిన మహామహులంతా ఇదే విషయాన్ని నిరూపించారు. భారత ఉపఖండంలో శాంతి సుస్థిరతలను కాపాడడంలో అమెరికా విదేశాంగ విధానం కీలక భూమిక పోషిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రష్యా– ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ట్రంప్ అపగలరా? ఇరాన్– ఇజ్రాయిల్ మధ్య సంఘర్షణను నిలువరించగలరా? ట్రంప్ పాలనపై పలు ప్రపంచ దేశాల భవిష్యత్తు ఆధారపడి ఉన్న దృష్ట్యా ట్రంప్ హుందాగా పాలిస్తూ ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని సమసిపోయేలా చేయాలని ఆశిద్దాం.

## ఖమ్మం జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిధి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులుగా పేరెల్లి శ్రీను

## ఉపాధ్యక్షులుగా కొమ్మినేని వీరన్న

## కోశాధికారిగా ఎస్.కె ఆఫ్రోజ్







ఖమ్మం ప్రతినిధి నవంబర్ 7 (ప్రజాబలం) ఖమ్మం లో జరిగిన జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిధి అధ్యాపకుల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కమిటీ సభ్యులు జాల్ అభిజిత్ దేవ్ రాజు రెడ్డి లు పాల్గొన్నారు వారి సమీక్షంలో జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిధి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులుగా పేరెల్లి శ్రీను , ఉపాధ్యక్షులుగా కొమ్మినేని వీరన్న , కోశాధికారిగా ఎస్.కె ఆఫ్రోజ్ లు ఎన్నికైనారు . అదేవిధంగా జిల్లా కార్యదర్శి కే. నవీన్ కుమార్ జిల్లా సంయుక్త కార్యదర్శులు సిహెచ్ రాజేష్ కుమార్ , డి.కోటేశ్వరరావు , జిల్లా కోశాధికారి వి.పుల్లారావు , జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కె.శైలజ , వై. శ్రీనివాసరావు , బి. కోటేశ్వరరావు కే.వాణి , కే. శేఖర్ లను కూడా ఎన్నుకున్నారు . అనంతరం వచ్చిన జిల్లా అతిధి అధ్యాపకులు వారందరినీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు

## సమగ్ర ఇంటింటి సర్వే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తుంది

## మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



తూప్రాన్, నవంబర్, 7. ప్రజాబలం న్యూస్ :– ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమగ్ర ఇంటింటి సర్వే ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిమిత్తం అధికారులు సందర్శించి నప్పుడు తమ పూర్తి సమాచారాన్ని అందించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని ఆయన సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆయన సూచించారు. సొంత నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం సర్వే నిర్వహించాలని, ఎక్కడైనా పొరపాట్లు జరిగితే మళ్లీ (రీ స్థిక్కర్స్, రీ సర్వే ) మొదటి నుండి సర్వే నిర్వహించాలని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు పొలాలకు ఉదయం వెళతారు గనుక ఇంట్లో ఉన్న సమయంలో తొందరగా వెళ్ళి సర్వే నిర్వహించాలని, సెల్ఫ్, డిక్లరేషన్ భాష, కోడ్ లను జాగ్రత్తగా నమోదు చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లెర్ల రవీందర్ గుప్త, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, మేనేజర్ రఘువరన్ తూప్రాన్ తాసిల్దార్ విజయలక్ష్మి సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఎస్ఐ బలవన్మరణానికి కారకులను శిక్షించాలి

పెద్దపల్లి ప్రతినిధి : కొత్తగూడెం జిల్లా ఆశ్వారావుపేటలో పని చేసిన దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీను బలవన్మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని న్యాయ పోరాట సంఘీభావ కమిటీ ప్రతినిధులు గురిమిల్ల రాజు, జిలుక శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం మాట్లాడుతూ ఎస్ఐ శ్రీనును పైఅధికారి కులం పేరుతో వేధించాడని ఆరోపించారు. అధికారి వేధింపులు పడలేక శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశానని ఇచ్చిన మరణ వాంగ్మూలం ప్రకారం సదరు అధికారిని ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. నిందితులకు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేసి వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, మృతుడి భార్యకు గ్రూప్ వన్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోరిక ఉదయ్ సింగ్, చక్రవర్తి, ఆరేపల్లి క్రాంతి కిరణ్, మొగిలి, ఎర్ర మోహన్ కృష్ణ, బాధిత కుటుంబ సభ్యురాలు శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## చౌటపల్లిలో మంత్రి పొన్నం పర్యటన

సిద్దిపేట హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట్ మండలం చౌటపల్లి లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ స్థల పరిశీలన చేసారు. మంత్రి వెంట పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి,టీజీఐఐసీ ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి ,సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తదితరులు వున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి,ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అక్కన్నపేట మండలం చౌటపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ కోసం స్థల పరిశీలన జరిగింది. స్థల సేకరణ పూర్తి చేసి ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ కి త్వరగా అప్పగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## లక్షెట్టిపేట న్యాయ విజ్ఞాన సదస్సు



ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 07 : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట టౌన్ మధ్యాహ్నం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు.గురువారం ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా లక్షెట్టిపేట కోర్టు జడ్జి అసదుల్లా షరీఫ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని.చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమే అని ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి తమ పనులు చేసుకోవాలని చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవనిహెచ్చరించారు.ఈ కి కార్యక్రమంలో బార్ అసోసియేషన్స్ అధ్యక్షుడు గుడి కొప్పుల కిరణ్, సభ్యులు,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి క్రాకెర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక అధ్యక్షులుగా బోల్ల కార్తీక్ ఎన్నిక



జమ్మికుం ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 7జమ్మికుంట పట్టణ దీపావళి క్రాకెర్స్ నూతన అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అసోసియేషన్ అధ్యక్షులుగా బోల్ల కార్తీక్,ఉపాధ్యక్షులు కొమురవెల్లి శివన్న,సెక్రటరీగా చొక్కారపు అఖిలేష్, జాయింట్ సెక్టరీగా దొడ్డే రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు బోల కార్తిక్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.దీపావళి క్రాకెర్స్ అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమములో పట్టణంలోని దీపావళి విక్రయదారులు అందరు పాల్గొని కార్యక్రమ విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దీపావళి క్రాకెర్స్ అసోసియేషన్ దీపావళి విక్రయదారులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమమే మజ్దూర్ యూనియన్ ధ్యేయం

## డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్.




జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 7 భారతీయ రైల్వే, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నేపథ్యంలో కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పోరాడే ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ యొక్క స్థానిక అనుబంధ సంస్థ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అగ్ర నాయకులైన కామ్రేడ్ పిల్లలమర్రి రవీందర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి కార్మిక పక్షపాత విధానాలకై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఎస్,సి,ఆర్,ఎం,యు యొక్క జెండా గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరడం జరిగింది. రైల్వే ఉద్యోగులకు బోనస్ సాధించడంలో నాటి మజ్దూర్ యూనియన్ నాయకుల పోరాటం ఎనలేనిదని భావితరాలకు కూడా ఆదర్శం అని వారి త్యాగాలను కొనియాడారు. జమ్మికుంట బ్రాంచ్ నందు కాజీపేట మొదలు బిసిగిర్ షరీఫ్ వరకు అన్ని స్టేషన్స్ మరియు యూనిట్స్ కార్మికులు డివిజినల్ సెక్రెటరీ రవీందర్ కు మజ్దూర్ నాయకులకు అడుగడుగునా నీరాజనాలు తెలుపుతూ వారిని ఘనంగా సత్కరించారు. డిసెంబర్ 4,5,6 న ఎన్నికలు జరగనున్నాయి.ఎన్నికల ప్రచారంలో, జమ్మికుంట శాఖ కార్యదర్శి బచ్చలి.శ్రీనివాస్ చైర్మన్ ఉప్పుల.రాజయ్య, ట్రెజరర్ ఏ సాంబరాజు,వైస్ చైర్మన్స్ బి.మొండయ్య,జి. స్వప్న,జి.శివ,జి.క్రాంతి కుమార్, అసిస్టెంట్ సెక్రటరీస్ ఏం. రవికుమార్,రవీందర్,కన్వీనర్ కుమార్ స్వామి,కో కన్వీనర్ ప్రవీణ్, ఇతర మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కమాన్ పూర్యువత విద్యార్థులు చెడు అలవాటులకు దూరంగా ఉండాలని షీ టీం ఇన్చార్జి స్నేహలత అన్నారు.గురువారం రామగుండం సి.పి ఆదేశాల మేరకు, పాలకుర్తి మండలం లోని కుక్కలాగూడూరు జడ్పీఎస్ఎస్ హై స్కూల్ విద్యార్థలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యుడు సురేష్ మరియు ఇంచార్జ్ హెడ్ మాస్టర్ సురేందర్ , ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

RNI No.TELTEL/2005/16755


# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




08 నవంబర్ 2024 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:135



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శుక్రవారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకోనున్నారు. స్వామి వారి దర్శనానంతరం సీఎంగారు మూసీ పునరుజ్జీవన సంకల్పంలో భాగంగా నది ఒడ్డున సంగెం నుంచి భీమలింగం వరకు పాదయాత్ర చేపడుతారు.

హైదరాబాద్ బేగంపేట్ నుంచి ఉదయం హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు బయలుదేరుతారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఆలయ అభివృద్ధి కార్యకలాపాలపై ముఖ్యమంత్రి సమీక్షిస్తారు.

అనంతరం రోడ్డు మార్గంలో సంగెం నుంచి మూసీ నది పునరుజ్జీవన సంకల్పం చేపడుతారు. సంగెం నుంచి పాదయాత్రగా మూసీ నది కుడి ఒడ్డున భీమలింగం వరకు దాదాపు 2.5 కిలో మీటర్ల పాదయాత్ర చేస్తారు. అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంట సంగెం - నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు పాదయాత్ర చేసి అక్కడ యాత్రను ఉద్దేశించి మూసీ పునరుజ్జీవ సంకల్ప రథంపై నుంచి ముఖ్యమంత్రి గారు స్థానికులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణమవుతారు.

## రణరంగంగా జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ

శ్రీనగర్, నవంబర్ 7, (న్యూస్ పల్స్)శాసనాలు తయారు చేసే లా మేకర్స్ పట్టు తప్పుతున్నారు. ఆవేశానికి లోనై ఒకరిపై మరొకరు ముష్టి ఘాతాలకు దిగుతున్నారు. ఈ తరహా ఘటనలు అప్పుడప్పుడు థాయ్‌లాండ్, తైపీ వంటి దేశాల్లో జరిగేవి. ఇప్పుడు ఇండియాకు సోకినట్టు కనిపిస్తోంది. లేటెస్ట్‌గా జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ గురువారం రణరంగంగా మారింది. అసలేం జరిగింది?జమ్మూకాశ్మీర్‌లో గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలు ప్రారంభం కాగానే సభ్యులు ఒకొక్కరిగా సభలోకి వస్తున్నాయి. ఆర్టికల్ 370 పునరుద్ధరణపై ఎమ్మెల్యేలు ఫైటింగ్‌కు దిగారు. సభలో జరిగిన తతంగాన్ని చూసి ప్రజలంతా నోళ్లు వెళ్లబెట్టారు.ఐదేళ్ల కిందట జమ్మూకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని రద్దు చేసింది కేంద్ర ప్రభుత్వం. దీన్ని పునరుద్ధరించాలంటూ బుధవారం అసెంబ్లీలో పీడీపీ తీర్మానం ప్రవేశపెట్టింది. దీన్ని బీజేపీ సభ్యులు వ్యతిరేకించారు. తీర్మానం పెట్టిన కాపీలను చించివేశారు.గురువారం సభా కార్యక్రమాలు మొదలుకాగానే ఎంపీ ఇంజనీర్ రషీద్ బ్రదర్.. ఎమ్మెల్యే ఖుర్షీద్ అహ్మద్ ఆర్టికల్ 370ని పునరుద్దరించాలంటూ సభలో బ్యానర్‌ని ప్రదర్శించారు. దాన్ని బీజేపీ నేత సునీల్ శర్మ అభ్యంతరం తెలిపారు.అక్కడి నుంచి సభలో సభ్యుల మధ్య గందరగోళం మొదలైంది. తొలుత సభ్యులు ఒకరినొకరు తోసుకున్నారు. ఈ లోగా శాసన కర్తలు ఆవేశానికి లోనయ్యారు. చివరకు ఒకరిపై మరొకరు పంచ్‌లు విసురుకున్నారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.స్పీకర్ ఆదేశాలతో మార్షల్స్ రంగంలోకి దిగేశారు. దాడులు చేసుకున్న ఎమ్మెల్యేలను విడదీశారు. పలువురు ఎమ్మెల్యేలకు బయటకు పంపారు. సభలో జరిగిన ఘటనపై బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఖుర్షీద్‌కు అనుకూలంగా స్పీకర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో సభను వాయిదా వేశారు స్పీకర్. అధికార-విపక్ష సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మరి సభ్యులు శాంతిస్తారా?

## లైంగిక కేసులు రద్దు చేయడం కుదరదు

### తేల్చి చెప్పిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ, నవంబర్ 7, (న్యూస్ పల్స్)లైంగిక ఆరోపణల కేసుల్లో ఇష్టానుసారం కేసుల రద్దుకు వీలు లేదని సుప్రీం తేల్చి చెప్పింది. బాధితులు ప్రాణాలతో బయటపడిన సందర్భాల్లో.. నిందితులు, బాధితుల కుటుంబ సభ్యుల మధ్య రాజీ ఆధారంగా.. కేసులను రద్దు చేయడం కుదరదని సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు కొన్ని కేసుల్లో నిందితులు, బాధితులు మధ్య తలెత్తే వివాదంలో రాజీ పడితే.. ఆయా కేసులు రద్దు చేసుకునేందుకు వీలవుతుంది. అయితే.. క్రిమినల్ కేసుల్లో ఇలాంటి అవకాశం లేదు. అయితే కొన్ని సందర్భాల్లో.. కోర్టులు వాటికున్న విచక్షణాధికారాన్ని వినియోగించుకుని.. కొన్ని కేసుల్ని రద్దు చేస్తుంటాయి. కానీ.. ఇకపై అలా చేయడానికి వీలు లేదన్న సుప్రీం ధర్మాసనం తాజా ఆదేశాలతో.. దేశంలోని అనేక కేసులకు ఈ తీర్పు మార్గనిర్దేశం కానుంది.ఇదే అంశంపై రాజస్థాన్ హైకోర్టు వెలువరించిన ఓ తీర్పుపై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం.. రాజస్థాన్ హైకోర్టు తీర్పును రద్దు చేసింది. లైంగిక ఆరోపణలు నమోదైన తర్వాత, బాధితులు ప్రాణాలతో బయటపడిన సందర్భాల్లో నిందితులు, బాధితుల మధ్యలో రాజీ ద్వారా ఆయా కేసులను ఉపసంహరించుకోవడం వీలవదని స్పష్టం చేసింది. ఈ మేరకు.. సీటీ రవి కుమార్, పీవీ సంజయ్ కుమార్ లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇలాంటి కేసుల్లో ఇంప్లీడ్ ఆర్డర్‌ను రద్దు చేస్తామని, కానీ.. ఎఫ్ఐఆర్(, క్రిమినల్ ప్రొసీడింగ్‌లను చట్ట ప్రకారం కొనసాగిస్తామని వెల్లడించింది.రాజస్థాన్ లో 15 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడో వ్యక్తి. దాంతో.. అతనిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరుగుతున్న తరుణంలో.. నిందితులు ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. బాధిత బాలిక కుటుంబంతో రాజీ కుదుర్చుకున్నామని, తమపై కేసుల విచారణను కొట్టి వేయాలని అభ్యర్థించారు. దానిపై విచారణ చేపట్టిన రాజస్థాన్ హైకోర్టు.. తనకున్న సెక్షన్ 482 సీఆర్ పీసీ (అతీఖఅ) విచక్షణాధికారాన్ని వినియోగించి.. నిందితులపై నమోదైన క్రిమినల్ కేసుల్ని రద్దు చేసింది.ఈ వ్యవహారంతో హైకోర్టులు సైతం.. లైంగిక ఆరోపణలు, మహిళలు, చిన్నారులపై పాల్పడే అఘాయిత్యాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, కోర్టులు సైతం విచక్షణతో నిర్ణయాలు తీసుకోవాలని సుప్రీం సూచించినట్లు స్పష్టమవుతుందని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. కోర్టులు సైతం.. అన్ని విషయాల్లో తమ విచక్షణాధికారాలను వినియోగించకుండా, సందర్భానుసారం.. సుప్రీం కట్టడి చేసినట్లు స్పష్టమవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలి:

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై నేడు ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్ లో సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ సర్వే కు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేల చర్యలు చేపట్టాలని సూచించారు.

దేశంలోనే ప్రధమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్య పర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటినికూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.

## విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి

### పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలక్షణమైన నాయకుడని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు.చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తి అని అన్నారు.శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మహేష్ కుమార్ గురువారము గాంధీ భవన్ లో పుస్తకాన్ని ఆవిష్కరిం చారు.పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి,విజయార్కెలను ఆయన అభినందించారు.ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని మహేష్ గౌడ్ ప్రస్థావించారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి తరపునా ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.రేవంత్ రెడ్డినిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్సుపూర్తిగా కోరుకుంటున్నానన్నారు

## వైటీడీఏపై సమీక్షా సమావేశం



హైదరాబాద్ యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ(వైటిడిఎ)పై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాలులో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కెఎస్ శ్రీనివాస రాజు (న్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్), దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత్ కొండిబా, వైటిడిఎ వైస్ ఛైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషన్ రావు, యాదగిరి గుట్ట ఈవో భాస్కర్ రావు, వైటిడిఎ ఎస్టేట్ ఆఫీసర్ సంతోష్ తదితరులు హాజరయ్యారు.

## ట్రంప్ గెలుపుతో..దిగొచ్చిన బంగారం ధరలు



న్యూ డిల్లీ నవంబర్ 7: గత కొన్ని రోజులుగా పరుగులు పెడుతున్న బంగారం ధరలకు బ్రేక్ పడింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఫారెక్స్ మార్కెట్లో యూఎస్ డాలర్ పుంజుకుంది. డాలర్ విలువ పెరగడంతో.. రూపాయి విలువ తగ్గింది. ఫలితంగా పుత్తడి ధరలు కూడా దిగివచ్చాయి.గత రెండు రోజుల్లో పది గ్రాముల బంగారం ధర రూ.2,100 తగ్గింది. అదే సమయంలో వెండి ధర కిలోకు రూ.4,050 తగ్గింది. గురువారం నాటికి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో డిసెంబర్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ 0.37 శాతం క్షీణతతో 10 గ్రాముల బంగారం ధర రూ.76,369 వద్ద ప్రారంభమైంది. వెండి డిసెంబర్ ఫ్యూచర్ కాంట్రాక్ట్‌లు 0.24 శాతం తగ్గి రూ.90,601కి చేరింది. బుధవారం నాడు ఇంట్రాడే ట్రేడింగ్‌లో కిలో వెండి ధర రూ.3,158 వరకూ పతనమై 91,490 వద్ద నిలిచిన విషయం తెలిసిందే.ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ ప్రకారం.. దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 76,570గా ఉంది. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.74,720గా, 20 క్యారెట్ల తులం బంగారం ధర రూ.68,130, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.62,201గా ఉంది. గుడ్‌రిటర్న్స్ డేటా ప్రకారం.. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,790 తగ్గి రూ.78,710కి చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,650 తగ్గి రూ.72,150 వద్ద కొనసాగుతోంది.

## కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ పక్కాగా జరగాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు.



తూప్రాన్, నవంబర్, 7. ప్రజాబలం న్యూస్ :- మెదక్ జిల్లా తూప్రాన్ మండలం రావెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత తాసిల్దార్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. సన్న రకం ధాన్యం క్రింద ఏ రకం ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశంపై రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. సన్న రకం దాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ అర్హులైన ప్రతి రైతుకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనుగోలు ప్రక్రియ సజావుగా, సక్రమంగా చేపట్టాలని, రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు.

సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించామని తెలిపారు. సమగ్ర కార్యాచరణ తో ముందుకు పోవాలన్నారు ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల తాసిల్దార్ విజయలక్ష్మి కొనుగోలు కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు



ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. గురువారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పౌర సేవలకు గుర్తింపు పత్రాల జారీ లో ఆలస్యం చేయకూడదన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ దరఖాస్తు పత్రాలను వెంటవెంటనె పరిశీలించాలని తెలిపారు.మండలాల వారిగా పెండింగ్ లో ఉన్న పౌర సేవల గుర్తింపు పత్రాల దరఖాస్తులు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ దరఖాస్తుల వివరాలను తహసిల్దారులను అడిగి తెలుసుకున్నారు. మండలాలకు సంబంధించిన పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు,ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వీటికి సంబంధించిన కోర్టు కేసు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండేవిధంగా చూడాలన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. తహసిల్దార్లంతా క్షేత్రస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. అన్ని మండలాల పరిధిలలో గల ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో భూముల సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు,ఈడీఎం నదీమ్, అన్ని మండలాల తహసిల్దార్లు,రెవెన్యూ అధికారులు,ఇతర అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసమ్మక్క-సారలమ్మ మహ జాతరకు నిధులు మంజూరు చేయాలని ఐటిడిఎ

## పీఓకు వినతి పత్రం అందించిన పూజారుల సంఘం



ప్రజాబలం ఏటూరునాగారం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి నవంబర్ 7:ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపురం గ్రామంలో 2025 ఫిబ్రవరి నెలలో 12నుండి15 తారీకు వరకు మఘు శుద్ధ పౌర్ణమిలో జరిగు శ్రీసమ్మక్క-సారళమ్మ మహా జాతరకు నిధులు మంజూరు చేయాలని శ్రీసమ్మక్క-సారళమ్మ ఐలాపురం పూజారుల సంఘం అధ్యక్షులు మల్లెల రవి ఆధ్వర్యంలో గురువారం రోజు ఏటూరునాగారం పీఓ చిత్రా మిశ్రాకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేశారు ఈ సందర్భంగా మల్లెల రవి మాట్లాడుతూ ఐలాపురం శ్రీసమ్మక్క-సారలమ్మ మహాజాతరకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,చత్తీస్గఢ్,మహారాష్ట్ర సరిహద్దుల్లో నుంచి అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు రవాణా,మంచినీటి,విద్యుత్,పారిశుధ్య పనులకు,తదితర అంశాలకు భక్తులకు పర్మినెంట్ సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయాలని ఏటూరునాగారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశామని అన్నారు.ఈ కార్యక్రమంలో పీరీల భాస్కర్,గ్రామ కొమరం భీమ్ యూత్ అధ్యక్షులు పీరీల సురేష్,పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖబర్దార్ పత్తి కృష్ణ రెడ్డి

## మాచినపల్లి మాజీ సర్పంచ్ పర్లపెల్లి రమేష్



జమ్మికుంట ప్రజా బలం ప్రతినిధి నవంబర్ 7 హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై, కాంగ్రెస్ నాయకుడు ప్రతి కృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలను మాచనపల్లి మాజీ సర్పంచ్ పర్లపల్లి రమేష్ తీవ్రంగా ఖండించారు. పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నువ్వు విమర్శించే స్థాయి పత్తి కృష్ణారెడ్డిది కాదు అని, కృష్ణారెడ్డి ఎలాంటి మోసగాడో ఈ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని, ఇంకొకసారి తమ ఎమ్మెల్యేను విమర్శిస్తే బయట తిరగనివ్వమని తీవ్రంగా హెచ్చరించారు.

# కమలం గూటికి కన్నబాబు



రాజమండ్రి, నవంబర్ 7, జగన్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన కన్నబాబు అప్పట్లో ఎప్పుడు మీడియాలో ఫోకస్ అవుతుండేవారు. ఓటమి తర్వాత జగన్ ఎంతో నమ్మకంతో ఆయనకు జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించినా యాక్టివ్ రోల్ పోషించడం కాదు కదా.. అసలు కేడర్‌కు కనిపించడమే మానేశారు. పార్టీలు మార్చే అలవాటున్న కురసాల కొత్త స్కెచ్ ఏదైనా గీస్తున్నారా?2024 ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైన వైసీపీ కేవలం 11 సిట్లకే పరిమితం అవటంతో.. ఎన్నికల్లో పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థుల్లో అత్యధికులు జనానికి ముఖం చాటేస్తున్నారు . జగన్ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా హల్‌చల్ చేసిన కాకినాడ రూరల్ శాసనసభ సభ్యుడు కురసాల కన్నబాబు కూడా ఓటమి తర్వాత కనిపించడం మానేశారు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా మాట్లాడితే.. వెంటనే ప్రెస్ మీట్ పెట్టి తన వాక్చాతుర్యం ప్రదర్శించేవారు ఒకప్పుడు జర్నలిస్టుగా పనిచేసిన కన్నబాబు.. అమరావతికి వ్యతిరేకంగా వాయిస్ వినిపించిన ఆయన తనకు సంబంధం లేని సినిమా టికెట్ల విషయంలో బాలకృష్ణపై కూడా విమర్శలు కురిపించిన సందర్భాలు కూడా ఉన్నాయి.అలాంటాయన మొన్నఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రజా జీవితానికి పూర్తిగా దూరమయ్యారు. ఎన్నికల ఫలితాలు తర్వాత క్యాడర్ కి కూడా అందుబాటులో లేకుండా పోయారని సొంత పార్టీ కార్యకర్తలే విమర్శిస్తున్నారు . ఓటమి తర్వాత కన్నబాబు పూర్తిగా సైలెంట్ అయినా.. జగన్ గత్యంతరం లేక ఆయనకే జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు. పార్టీ బాధ్యతలు అప్పగించినా ఆయన మాత్రం సైలెంట్ మోడ్ కంటిన్యూ చేస్తున్నారు. జిల్లాలో ఒక్క సీటు కూడా వైసీపీ గెలుచుకోలేకపోవడంతో అన్ని నియోజకవర్గాల పార్టీ శ్రేణుల్లో స్తబ్ధత ఏర్పడింది. పార్టీ వర్గాలను యాక్టివ్ చేయడానికని మాజీ మంత్రి కన్నబాబుని జిల్లా అధ్యక్షుడ్ని చేస్తే ఆయన తన సొంత లెక్కలతో సైలెంట్ అయ్యారన్న టాక్ వినిపిస్తుంది. ఢిల్లీ లెవెల్ లో లబీయింగ్ చేసుకుంటూ పార్టీ మారే ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది.కురసాల కన్నబాబు ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం సమయంలో వైజాగ్‌లో ప్రముఖ దిన పత్రిక జర్నలిస్టు.. ఆ పరిచయాలతో కాకినాడ రూరల్ పీఆర్పీ టికెట్ దక్కించుకుని 2009లో శాసనసభ్యుడిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 నాటికి మారిన పరిస్థితుల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఆయన.. 2019 ఎన్నికల్లో వైసీపీలో చేరి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచి.. మంత్రి పదవి కూడా నిర్వహించారు . ప్రధానంగా కురసాల కన్నబాబు మంత్రిగా కొనసాగిన సమయంలో నియోజకవర్గంలో తండ్రి కురసాల సత్యనారాయణ, తమ్ముడు, సినీ దర్శకుడు కురసాల కళ్యాణ్‌కృష్ణ పెత్తనంతో అటు పార్టీ క్యాడర్ , ఇటు అధికార యంత్రాంగం ఇబ్బందులు ఎదుర్కొన్నారంటారు.ముఖ్యంగా వైసీపీ పాలనలో సచివాలయం నిర్మాణాలు, సీసీ రోడ్ల నిర్మాణాల కాంట్రాక్టులు చేసిన కొందరు నాయకులు సదరు బిల్లులు మంజూరవ్వక ఇబ్బందులు పడ్డారు. అయితే రూరల్ మండలం లో ఉన్న పరిశ్రమల వద్ద సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనుల కాంట్రాక్టు లు అన్నీ కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ చేయించారు. వాటి బిల్లులు వెంటవెంటనే మంజూరు అయ్యాయి. దాంతో డబ్బులు వచ్చే పనులు మీకు రాని వాటిని మాకు ఇస్తారా అన్న అసంతృప్తి నాయకుల్లో ఎన్నికల సమయానికే వచ్చేసిందంటారు.ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆ అసంతృప్తి బయటపడి పార్టీ నాయకులు, కార్యకర్తలు కన్నబాబుకు పూర్తిగా దూరం అయ్యారు. చాలా మంది వైసీపీకి గుడ్ బై చెప్పి తమ దారి తాము చూసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ తిరిగి జిల్లా అధ్యక్ష పదవిని కన్నబాబుకు ఇవ్వడాన్ని పార్టీలో మిగిలి ఉన్న కొందరు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కురసాల కన్నబాబు నివాసం ఎదురుగా పంచాయితీకి సంబంధించిన స్థలంలో తన క్యాంపు కార్యాలయం నడిపేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశాలతో పంచాయితీ స్థలంలో నిర్మించిన దానికి నోటీసులు ఇచ్చి నిర్మాణాలను తొలగించారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కేవలం మూడు సార్లు మాత్రమే కురసాల కన్నబాబు మీడియా ముఖం చూశారు. పిఠాపురంలో మైనర్ బాలిక హత్యాచారం ఘటన, ఇసుక , మద్యం పాలసీలు, సూపర్ సిక్స్ పథకాల అమలు పై మాట్లాడిన ఆయన ఎక్కడ పవన్ కళ్యాణ్ పై నోరు జారకుండా కేవలం చంద్రబాబు పై విమర్శలు చేసి వెళ్లారు. ఆ విమర్శల్లో కూడా మునుపటి వాడి, వేడి కనిపించలేదు. ఆ మార్పును చూస్తూ ఆయన కూటమి ప్రభుత్వంతో సత్సంబంధాలు కోరుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీడీపీ, జనసేనల్లో చేరే అవకాశం లేకపోవడంతో బీజేపీ గూటికి చేరాలని మంతనాలు జరిపినట్లు చెప్తున్నారు. మరి కాషాయ పార్టీ కన్నబాబుని ఏ మాత్రం కరుణిస్తుందో చూడాలి.

## దళిత బంధు సన్నవడ్లకు బోనస్ ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే


- సమగ్ర కులగణన సర్వే దేశానికే ఆదర్శం.
- దళితులను మోసం చేసిన వ్యక్తి కౌశిక్ రెడ్డి.
- ఆందోళన వద్దు 500 బోనస్ ఇచ్చి తీరుతాం.
- ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలకు ప్రజాప్రభుత్వంలో పరిష్కారం అయ్యేలా కృషి.
- ఎమ్మెల్యే భూ కబ్జాల బాగోతం ఒక్కొక్కటిగా బయటికి తీస్తాం.
- కౌశిక్ నువ్వొక రాజకీయ బచ్చావి,కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదు.
- ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకత పాటిస్తాం.

కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్



హుజురాబాద్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 7 హుజురాబాద్ శాసన సభ్యుడు కౌశిక్ రెడ్డి గత కొద్ది రోజులుగా చేస్తున్న వ్యాఖ్యల పట్ల తీవ్రంగా ఖండించారు.కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. హుజురాబాద్ అభివృద్ధిపై మేము దృష్టిసారిస్తే ఒక్క రూపాయి కూడా పనిచేయకుండా భూకబ్జాలకు వంతపాడుతూ, రాజకీయపబ్బం గడుపుతున్నారని ఎద్దేవాచేశారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మొట్ట మొదటిసారిగా తెలంగాణలో రాహుల్ గాంధీ సూచనల మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలో సమగ్ర కులగణన చేపడుతున్నామని దీనికి ప్రతి ఒక్కరు తమ వివరాలను అధికారులకు తెలుపాలని కోరారు. రెండేళ్లు ఎమ్మెల్సీగా ఉండి, ప్రభుత్వ విప్ గా పనిచేసి దళితులను మోసం చేసిన వ్యక్తి కౌశిక్ రెడ్డి అని ఇప్పుడు టెంట్ వేసుకొని కూర్చోవడం చంపినోడే సంతాపం తెలిపినట్టు ఉంటుందని ప్రణవ్ అన్నారు. కౌశిక్ రెడ్డి మాటలు వింటే కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్టు ఉంటుందని, ఓట్ల కోసం వాడుకున్నారే తప్ప దళితుల కోసం ఏనాడు ఆలోచించలేదని మరోసారి కౌశిక్ రెడ్డి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని త్వరలో రెండవవిడత దళిత బంధు అందజేస్తామని మునుపటిలాగా దళారివ్యవస్థ లేకుండా చూస్తామని ఇప్పటికే ఈ విషయానికి సంబంధించి ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు అన్ని వివరాలు సమర్పించామని అన్నారు. అలాగే వడ్ల కొనుగోలు విషయంలో ఎమ్మెల్యే రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని, చెప్పిన మాట ప్రకారం రైతులకు సన్నవడ్లకు క్వింటాకి 500 బోనస్ ఖచ్చితంగా ఇస్తామని దీనిపై రైతులు ఏలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. కొనుగోలుపై మంత్రులు, కలెక్టర్, నేను సమీక్ష జరిపామని కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని అన్నారు. రుణమాఫీ విషయంలో ఇప్పటికే 2లక్షల వరకు మాఫీ అయ్యాయనీ, సాంకేతిక కారణాల వలన రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పరిపాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ఇప్పుడు దాన్ని సర్దిద్దుకుంటున్నామని అన్నారు. ఈసారి వర్షాలు కొంత ఆలస్యంగా పడడం వల్ల చెరువులో చేపలు కలపడం లేట్ అయిందని అయినా కూడా ఇప్పటివరకు 50 శాతం పూర్తి చేసామని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమానికి పార్టీ కార్యక్రమానికి తేడా తెలవని అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్న కౌశిక్ రెడ్డి హుజురాబాద్ లో రౌయ్యపిల్లలను ఎక్కడ కలిపారో చూపించాలని కోరారు.తన సొంత మండలమైన వీణవంకలో సాక్షాత్తు ఎమ్మెల్యే, అతని అనుచరుడు భూకబ్జాలకు పాల్పడ్డాడని సంచలన ఆరోపణ చేశారు. అమెరికాలో ఉంటున్న శివప్రియ భూమి ఆక్రమణ చేసి తద్వారా సంబంధిత ఎమ్మార్వో ను ఒత్తిడి చేసి సంతకాలు ఫోర్జరీ చేసి ఆ భూమిని దొంగ రిజిస్ట్రేషన్ చేపించుకున్నారని ఇది నిజం కాదా చెప్పాలని కోరారు.వీణవంక మండల రెవెన్యూ అధికారి ధరణి ఆపరేటర్ సస్పెండ్ అయ్యారని దీనికి సమాధానం చెప్పాలని ఒక్కొక్కటిగా హుజురాబాద్ లో కౌశిక్ రెడ్డి చేసిన భూ దందాలు బయటికి తీస్తామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఏల్లుగా పరిష్కారం కానీ సమస్యలకు ఇప్పుడు పరిష్కారం చూపిస్తున్నామని అందులో భాగంగానే హుజురాబాద్ వాకర్స్ అసోసియేషన్ వారు అడగగానే ఎంత కష్టమైనా పదిలక్షల రూపాయలతో వాకర్స్ ట్రాక్ పాఠశాల మైదానానికి గేట్ అమలుకు ఉత్తర్వులు మంజూరు అయ్యాయని అన్నారు. ఇదేవిధంగా రానున్న రోజుల్లో హుజురాబాద్ అభివృద్ధికి మరింత బాధ్యతగా పనిచేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు విషయంలో కూడా పారదర్శకత పాటిస్తామని అన్నారు. ఇంకోసారి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేదిలేదని హుజురాబాద్ లో అడుగుకూడా పెట్టనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతన్నారు... ఇంతన్నారు.. మరి ఇప్పుడేమో,,,



తిరుపతి, నవంబర్ 7,కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని వైసిపి నేతలు శపథం చేశారు. గత ఐదేళ్లుగా గట్టి ప్రయత్నమే చేశారు. కానీ వారు ఒకటి తలిస్తే.. ప్రజలు మరోలా భావించారు. చంద్రబాబును గెలిపించారు. ఇప్పుడు కుప్పంలో వైసిపి అడ్రస్ గల్లంతయ్యేలా ఉంది.

గత ఐదేళ్లలో ఒక బలమైన నినాదం తెరపైకి వచ్చింది. వై నాట్ కుప్పం అన్న స్లోగన్ వినిపించింది. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని వైసిపి నేతలు శపథం చేశారు. ఒక్కరిద్దరు కాదు అందరిదీ అదే మాట. జగన్ సైతం కుప్పం గెలవబోతున్నామని చెప్పుకొచ్చారు. 2019లో చంద్రబాబుకు మెజారిటీ తగ్గింది కుప్పంలో. అటు తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించింది వైసిపి. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలను దక్కించుకుంది. కుప్పం మున్సిపాలిటీని సైతం కైవసం చేసుకుంది. దీంతో వైసీపీకి ఎక్కడలేని ధీమా వచ్చింది. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ఓడిస్తామని వైసీపీ శ్రేణులు ప్రచారం చేయడం మొదలుపెట్టాయి. ఆ ధీమాతో చంద్రబాబు తన సొంత నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో కూడా ఇబ్బందులు పెట్టింది వైసిపి. ఒకానొక దశలో దాడులకు తెగబడింది. అయితే అన్నింటినీ భరిస్తూ.. క్యాడర్ను సమన్వయ పరుస్తూ.. ప్రజలకు జరిగినవన్నీ చెబుతూ ముందుకు సాగారు చంద్రబాబు. ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం నుంచి ఏకపక్షంగా విజయం సాధించారు చంద్రబాబు. వైసిపి కనుచూపుమేరలో కూడా కనిపించలేదు.కుప్పం వైసిపి బాధ్యతలను యువకుడు భరత్ కు అప్పగించారు జగన్. ఆయన నాయకత్వాన్ని బలపరచాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. కుప్పంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టించారు.పాలనాపరమైన నిర్ణయాల్లో కుప్పం నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యవేక్షక బాధ్యతలు సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి అప్పగించారు జగన్. పెద్దిరెడ్డి తన సొంత నియోజకవర్గ పుంగనూరు కంటే కుప్పం పైన ఎక్కువగా దృష్టి పెట్టారు పెద్దిరెడ్డి. నియోజకవర్గంలో టిడిపి శ్రేణులకు భయాందోళనకు గురిచేసి పార్టీలో చేర్చుకున్నారు. ప్రలోభాలకు సైతం గురి చేశారు. దీంతో టీడీపీ కేడర్లో ఒక రకమైన ఆందోళన కనిపించింది. ఎట్టి పరిస్థితుల్లో కుప్పంలో చంద్రబాబు గెలవకూడదన్న లక్ష్యంతో పని చేశారు జగన్, పెద్దిరెడ్డి త్రయం. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఈసారి ఆయనను గెలిపిస్తే తప్పకుండా మంత్రిని చేస్తానని కూడా జగన్ హామీ ఇచ్చారు. అయితే నియోజకవర్గ ప్రజలు మాత్రం ఎక్కడ వెనక్కి తగ్గలేదు. చంద్రబాబును మెజారిటీతో గెలి పించారు.వై నాట్ కుప్పం అని నినాదం చేసిన ఒక్క నేత కూడా ఇప్పుడు కుప్పంలో లేరు. చంద్రబాబుపై పోటీ చేసిన భరత్ కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో చంద్రబాబు పర్యటనలో ఇబ్బందులు పెట్టిన వారందరిపై కేసులు నమోదయ్యాయి. ఈ తరుణంలో చాలామంది నేతలు టిడిపిలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో వైసీపీ నేతల ప్రలోభాలతో పార్టీ వీడిన చాలామంది నేతలు తెలుగుదేశం పార్టీలో తిరిగి చేరుతున్నారు. తాజాగా కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ తెలుగుదేశం పార్టీలో చేరారు. అంతకుముందే ఆయన మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్ వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన బాటలోనే మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

మొన్న ఆ మధ్యన ఎమ్మెల్సీ భరత్ కూడా టిడిపిలో చేరేందుకు ముందుకొచ్చినట్లు సమాచారం. కానీ టిడిపి క్యాడర్ వ్యతిరేకించడంతో ఆయనను తీసుకోలేదు.

మొత్తానికైతే కుప్పంలో వైసిపి పూర్తిగా ఖాళీ కావడం విశేషం.

# మరో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా...

ఏలూరు, నవంబర్ 7,వై నాట్ 175 అన్న నినాదంతో బరిలో దిగింది వైసిపి. కానీ ఆ పార్టీకి 11 సీట్లు మాత్రమే దక్కాయి. అయితే ఇప్పుడు ఆ బలం మరో రెండు సంఖ్యలు తగ్గనున్నట్లు సమాచారంఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 11న ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెడుతుందా? లేదా? అన్న దానిపై ఇప్పటికీ క్లారిటీ రాలేదు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈరోజు క్యాబినెట్ భేటీ జరగనుంది. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మరోవైపు వైసిపి అధినేత జగన్ సభకు వస్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం వైసిపి హాజరుపై ఓ రేంజ్ లో ర్యాగింగ్ జరుగుతోంది. ప్రస్తుతం వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఈ నెల 11న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కొనున్నాయి. దీంతో వైసీపీ నెంబర్ 11 ను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో విరుచుకుపడుతున్నారు నేటిజెన్లు. ఆ 11 మంది హాజరవుతారా? ఆ నాయకుడు హాజరవుతాడా? అంటూ కూటమి పార్టీల శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతోంది. ప్రమాణ స్వీకారం రోజు వచ్చిన ఎమ్మెల్యే జగన్ కొద్దిసేపు సభలో ఉండి వెళ్ళిపోయారు. గత శాసనసభకు వచ్చినట్టే వచ్చి వెళ్లిపోయారు. ఈసారి సమావేశాలకు వస్తారా? లేదా అన్నది సస్పెన్స్ గా మారింది.ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. ఇదే అంశాన్ని పవన్ కళ్యాణ్ ప్రస్తావిస్తూ హోం శాఖ పనితీరును తప్పుపట్టారు. అప్పటినుంచి వైసిపి రెచ్చిపోతుంది. ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయని చెబుతోంది. కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శిస్తోంది. అదే పనిగా వ్యతిరేక ప్రచారం చేస్తోంది. అయితే వైసీపీ దూకుడుకు కళ్లెం వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా చంద్రబాబు భారీ స్కెచ్ తో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీని ఇరుకున పెట్టేలా ఈరోజు క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.మరోవైపు వైసీపీ ఆత్మస్థైర్యాన్ని మరింత దెబ్బతీయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వైసీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలను టిడిపిలోకి లాక్కోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరు.. రాయలసీమ నుంచి ఒక ఎమ్మెల్యే టిడిపి వైపు చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ జగన్ శాసనసభకు హాజరైన ఏమీ మాట్లాడకుండా చేయాలని చూస్తున్నట్లు సమాచారం. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు టిడిపి వైపు వస్తే వైసిపి ఆత్మరక్షణలో పడడం ఖాయం. అందుకే వైసీపీని ఇరుకునపెట్టే ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## ఏఐ హబ్ గా అమరావతి

విజయవాడ, నవంబర్ 7, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు సీఎం చంద్రబాబు. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే.. మరోవైపు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చి.. అభివృద్ధి బాటలు వేయాలన్నది చంద్రబాబు ప్లాన్. అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించారు.ఏపీ సీఎం చంద్రబాబు ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. వైవిధ్యంగా కూడా ఉంటాయి. ఏదైనా ముందుచూపుతో వ్యవహరిస్తారన్న మంచి పేరు ఆయనకు ఉంది. సైబరాబాద్ ఆలోచన ఆయనదే. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా.. ఈ విషయంలో మాత్రం మెజారిటీ ప్రజలు చంద్రబాబుకు జై కొడతారు. అయితే అనూహ్య పరిస్థితుల్లో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది. గత అనుభవాల దృష్ట్యా అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు,రాష్ట్రానికి ఆదాయం సమకూర్చుకోవడం పై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ గా మార్చే ప్రణాళికలను రూపొందించారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,డ్రోన్ తయారీ,సెమి కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలన్నది చంద్రబాబు లక్ష్యంగా తెలుస్తోంది. భవిష్యత్తులో అన్ని రకాల సేవలు, లావాదేవీలు డ్రోన్ టెక్నాలజీ ద్వారా జరగనున్నాయి. మొన్న విజయవాడ వరదల్లో సైతం డ్రోన్లతోనే బాధితులకు ఆహారం అందించారు. అదే డ్రోన్లతోనే సాగులో అనేక రకాలైన సేవలు చేపడుతున్నారు. దాదాపు అన్ని రంగాల్లో డ్రోన్ల ఎంట్రీ ఖాయంగా తెలుస్తోంది. అందుకే ఆ రంగంపై చంద్రబాబు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.మొన్న ఆ మధ్యన విజయవాడలో అంతర్జాతీయ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.సరికొత్త ఆవిష్కరణలు చేశారు. అయితే దీని వెనుక చంద్రబాబు ప్రత్యేక వ్యూహం ఉంది. అమరావతిని డ్రోన్ల హబ్ గా మార్చాలి అన్నది చంద్రబాబు ప్లాన్. దేశం యావత్తు అమరావతి వైపు చూసేలా.. భారీ డ్రోన్ల రూపకల్పనకు అమరావతిని చిరునామా చేయాలన్నది లక్ష్యం. అందుకే ఇక్కడ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి.. అమరావతి చర్చకు వచ్చేలా చేశారు. మరోవైపు డ్రోన్ ఉత్పత్తి కంపెనీలకు అనంతపురంలో డెస్టినేషన్ గా మార్చాలని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇప్పటికే శ్రీ సిటీలో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యాయి. దానిని సెమీ కండక్టర్ హబ్ గా మార్చేందుకు చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు.మరోవైపు సాగరనగరం విశాఖలో ఐటీ అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు. ఇప్పటికే నారా లోకేష్ అమెరికా వెళ్లారు. దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.విశాఖలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అన్ని రకాల వసతులు ఉన్నాయి. అందుకు అక్కడ మరింత అభివృద్ధి చేసి.. ఐటీ రంగంలో విశాఖను దేశంలోనే అగ్రగామిగా నిలపాలని చంద్రబాబు భావిస్తున్నారు. మొత్తానికి అయితే మంచి ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు బాబు. మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు జరిపారు. టెక్నాలజీ రంగంలో సంస్కరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. అవి మంచి ఫలితాలు ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బ్యాట్మెంటన్ ఆకాడమికి భూమి పూజ చేసిన పివి సింధు

విశాఖ ఆరిలోవలో ప్రభుత్వం కేటా యించిన భూమిలో బ్యాడ్మింటన్ అకాడమి నిర్మాణానికి కుటుంబ సభ్యులతో కలిసి పీవీ సింధు భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఏడాదిలోపు అకాడమి నిర్మాణంచేస్తామని తెలిపారు. విశాఖలోని యువతకు బ్యాడ్మింటన్ నేర్చుకునే సామర్థ్యం ఎక్కువని చెప్పారు. అకాడమికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని, దీని ద్వారా ఎంతోమంది క్రీడాకారులు పథకాలు సాధించేలాగా చేస్తామనిపేర్కొన్నారు.

# సోషల్ మీడియా ఓవర్ చేసే వారిని వెంటాడుతున్నారు,,,

గుంటూరు, నవంబర్ 7 ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియాలో తిడితే ఇక కుదరదు. ఉపేక్షించరు కూడా. నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారు కూడా. ఇప్పుడు ఏపీ పోలీసులు అదే చేస్తున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టుల మాటున వైసిపి అనుచరులు చేస్తున్న ఆగడాలపై ఫోకస్ పెట్టారు.

సోషల్ మీడియాలో కొందరు రెచ్చిపోయారు. వైసిపి హయాంలో ఇటువంటి వారిని పెంచి పోషించడంతో ప్రత్యర్థులను వెంటాడారు.భావప్రకటన స్వేచ్ఛ పేరుతో రాజకీయ ప్రత్యర్థులను కించపరిచారు. కొంతమంది వైసీపీ యాక్టివిస్టుల చేసిన అతి అంతా కాదు. ఇప్పటికీ వారు అదే పంథాను అనుసరిస్తుండడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. సోషల్ మీడియా పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ విధానాలపై వ్యతిరేక ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించింది.. ఒకే రోజు వందలాదిమందిపై కేసులు నమోదు చేసింది. కొందరిని అరెస్టు చేసింది కూడా. ఇటువంటి వారిలో పంచ్ ప్రభాకర్, ఇంటూరి కిరణ్, బుర్ర రవీంద్ర రెడ్డి లాంటి వాళ్లను కూడా అరెస్టు చేస్తున్నారు. సోషల్ మీడియా కీచకుల పని పడుతున్నారు. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడడం వీరి పని. ఇందుకు గాను రాజకీయ పార్టీలు భారీగా వీరికి ముట్ట చెబుతుంటాయి. గత వైసిపి పాలనలో ఇటువంటి వారికి చేతినిండా పుష్కలంగా పని ఉండేది. అధికార పార్టీ అండదండలతో వీరు రెచ్చిపోయేవారు. అయితే ఇప్పుడు వీరికి ఆదాయం తగ్గుముఖం పట్టింది. వైసిపి ఇప్పటికీ వీరిని పెంచి పోషిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. సీరియల్ కింద అరెస్టులు చేస్తుండడంతో.. వీరికి బెయిల్ రావడం కష్టమని భావిస్తున్నారు.వైసిపి హయాంలో న్యాయ వ్యవస్థ సైతం కామెంట్స్ చేసిన వారు ఉన్నారు. సోషల్ మీడియా వేదికగా జడ్జిలను తిట్టిన వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్నాళ్లు వారు మారుతారేమోనని చూశారు. కానీ దానిని మరింత అలుసుగా తీసుకున్నారు సోషల్ మీడియా కీచకులు. చివరికి హోం మంత్రి అనిత మీద కూడా మార్ఫింగులు చేస్తున్నారు. ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో ఏ విధంగా వేధించారో చెప్పారు. తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పోలీసుల దూకుడు చూస్తుంటే మరింతమంది అరెస్టులు కావడం ఖాయం అని తెలుస్తోంది.పంచ్ ప్రభాకర్ అనే వ్యక్తి సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అసభ్య పదజాలాలను వాడుతుంటారు.

పంచ్ ప్రభాకర్ పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న ఇతను వైసీపీ సానుభూతిపరుడు. ఎన్నికల తరువాత కూడా రెచ్చిపోతుండడంతో ఈయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాయి జయంతి అనే ఎక్స్ ఎకౌంటు హోల్డర్ పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

మొత్తానికైతే ఏపీ పోలీసులు సోషల్ మీడియా కీచుకులకు పరుగులు పెట్టిస్తున్నారు.

# హిందువులపై దాడులు ఎందుకు....

మొన్న బంగ్లాదేశ్? ఈరోజు కెనడా.. రేపు ఇంకెక్కడా..? ఎందుకు హిందువులపై దాడులు జరుగుతున్నాయి..? దౌత్యపరంగా భారత్ కెనడాల మధ్య కొనసాగుతున్న విభేదాల మధ్యలో తాజాగా హిందువులు టార్గెట్ అవ్వడం విస్మయానికి గురిచేసింది. కెనడాలో దివాలీ పూజల కోసం వెళుతున్న హిందువులపై కెనడాలోని ఖలిస్తాన్ మద్దతుదారులు దాడులకు దిగారు. కెనడా పోలీసులు సైతం హిందువులపై దాడి చేశారు. ఈ దాడిని నిరసించే సమయంలోనూ కెనడా పోలీసులు రెచ్చిపోయారు. ఖలిస్తాన్ తీవ్రవాది నిజ్జర్ హత్యతో భారత్, కెనడా మధ్య దౌత్య వివాదాలు రాజుకున్నాయ్. అప్పటి నుండీ కెనడాలోని హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు పెరిగాయి. వీటితో పాటు ఇరు దేశాల మధ్య దూరం కూడా పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ, కెనడా ప్రధాని మాత్రం తమ దేశంలోని సిక్కు తీవ్రవాదాన్ని సమర్థిస్తూనే ఉన్నారు. ట్రూడో మెతక వైఖరి వల్ల కెనడాలో మూడవ అతిపెద్ద మతంగా ఉన్న హిందూ మత ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వస్తోందని హిందూ వాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్రిక్తతలు తగ్గేదెప్పుడా అని కెనడాలోని హిందువులు ఎదురుచూస్తున్నారు.ఏ దేశమైనా మరో దేశ అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చాలంటే ఒక అంతర్జాతీయ కారణం ఉండాలి. లేదంటే, అది తమ దేశంపై ఏదైనా ప్రభావం చూపుతుండాలి. అదీకాదూ అంటే, మానవహక్కుల ఉల్లంఘన వంటి వ్యవహారాల్లో సలహాలు, సూచనలు ఇవ్వొచ్చు. అలాకాదని, కేవలం తన రాజకీయ లాభాల కోసం భారతదేశంపై బురద చల్లాలనుకుంటున్నారు కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో. భారత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. కెనడా గడ్డపై జరుగుతున్న తీవ్రమైన నేరపూరిత చర్యల్లో భారత్‌కు ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఆరోపించినప్పటి నుండీ తన మాటల్లో నిజముందని చెప్పడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలను చూపించలేదు సరికదా.. ఇటీవల చేసిన కొత్త వాదనలో.. కెనడాలో ఖలిస్థాన్ అనుకూల అంశాలను లక్ష్యంగా చేసుకోవడానికి, లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి భారత్ ఏజెంట్లు పనిచేస్తున్నారని కెనడా అధికారులు ఆరోపించారు. అక్టోబర్ 14 అర్థరాత్రి ప్రెస్‌తో మాట్లాడిన రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అధికారులు భారత్‌ను నిందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యలో అనుమానితుల జాబితాలో కెనడాలోని భారత్ హైకమిషనర్ సంజయ్ వర్మ, ఇతర దౌత్యవేత్తల పేర్లను చేర్చారు.సిక్కు వేర్పాటు వాదులైన ఖలిస్థానీ తీవ్రవాదులు చేసే వ్యవస్థీకృత నేరాలతో సంబంధాలున్న వ్యక్తులకు కెనడా రక్షణ కల్పించడపై భారత్ దశాబ్దాలుగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే, ఈ ఏడాది మేలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. నిజ్జర్ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు భారతీయులను అరెస్టు చేసిన తర్వాత కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాన్ని విమర్శించారు. పంజాబ్ నుండి వ్యవస్థీకృత నేరాలతో లింక్‌లు ఉన్న చాలా మంది ఖలిస్థానీ తీవ్రవాదులను కెనడా స్వాగతిస్తుందనీ ఆరోపించారు. వీళ్లు భారతదేశంలో వాంటెడ్ క్రిమినల్స్ అనీ.. మీరు వారికి వీసాలు ఇచ్చారని కెనడా ప్రభుత్వాన్ని విమర్శించారు.ఇక, అక్టోబర్ 14న భారత హైకమిషనర్‌పై కెనడా అధికారులు ఆరోపణలు చేసిన తర్వాత, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఘాటైన ప్రకటనను విడుదల చేసింది. కెనడా ప్రధాని ట్రూడో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నట్లు పేర్కొంది. దీనికి నిరసనగా, ఆరుగురు కెనడియన్ దౌత్యవేత్తలను బహిష్కరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, కెనడాలోని తమ హైకమిషనర్ సంజయ్ వర్మతో పాటు, మరికొందరు దౌత్యవేత్తలను కాల్ బ్యాక్ చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అయితే, భారత్ ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. ఆరుగురు భారత దౌత్యవేత్తలను తామే బహిష్కరించామని ఆయన చెప్పారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వం సహకరించకపోవడమే ఇందుకు కారణమని ట్రూడో అన్నారు.కెనడాలో ఉన్న సిక్కు దయాస్పోరాలో ఖలిస్థాన్ ఉద్యమానికి మద్దతు ఉందనేది బహిరంగ రహస్యం. టెర్రర్ గ్రూపులకు మద్దతు ఇచ్చే కనీసం తొమ్మిది వేర్పాటువాద సంస్థలకు కెనడాలో స్థావరాలున్నట్లు సమాచారం ఉంది. వీటిపైన అనేకసార్లు బహిష్కరణ వేటుకూడా వేశారు. అయినప్పటికీ, కెనాడా దీనిపై చర్యలు తీసుకోలేదు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యతో సహా ఘోరమైన నేరాలకు పాల్పడిన ఖలిస్థాన్ తీవ్రవాదులపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని న్యూఢిల్లీలోని అధికారులు ఇటీవల వెల్లడించారు. వరల్డ్ సిక్ ఆర్గనైజేషన్-డబ్ల్యూఎస్ఓ, ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కెటిఎఫ్), సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె), బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బికెఐ) వంటి ఖలిస్తాన్ అనుకూల సంస్థలు కెనడియన్ నేలపైన పాకిస్తాన్ ఆదేశానుసారం పని చేస్తున్నాయని భారత్ ఆరోపిస్తూనే ఉంది. అయినప్పటికీ, కెనడాలో యదేచ్ఛగా తీవ్రవాద కార్యకలాపాలు నడుస్తూనే ఉన్నాయ్.ఖలిస్థాన్ వాంటెడ్ టెర్రరిస్టులు, గ్యాంగ్‌స్టర్ల బహిష్కరణ అంశాన్ని, గతంలో కెనడా, భారత్‌ల మధ్య జరిగిన అనేక దౌత్య, భద్రతా చర్చల్లో భారత అధికారులు ప్రస్తావించారు. కానీ, కెనడా అధికారులు ఈ సమస్యను పట్టించుకోక పోగా? ఉగ్రవాద వ్యవహారల్లో మద్దతు ఇస్తూ వస్తున్నారు. దీనికి ఆధారాలు కూడా లేకపోలేదు. కెనడాలో ఖలిస్థాన్ ఉద్యమానికి సపోర్ట్‌గా అనేక పత్రాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఖలిస్థాన్ మద్దతులో నడిచే ర్యాలీలు, సభలు యధేచ్ఛగా నడుస్తున్నాయి. కెనడాలోని హిందూ దేవాలయాలే లక్ష్యంగా హిందూ, భారత వ్యతిరేక పోస్టర్లు, గ్రాఫిటీ ప్రచారాలు తరుచుగా దర్శనమిస్తాయి.ఆగస్ట్ 2024లో, ఖలిస్తాన్ అనుకూల బృందం భారత స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ కోసం ఏర్పాటు చేసిన ఒక వేదిక వద్దకు వచ్చి, "కెనడియన్ హిందువులు భారతదేశానికి తిరిగి వెళ్లండి" అని అరిచారు. ఈ సంఘటనకు ముందు, వేర్పాటువాద గ్రూపు అయిన సిక్స్ ఫర్ జస్టిస్ సంస్థ? ఖలిస్తానీ సిక్కులు-కెనడియన్ హిందువుల మధ్య "ముఖాముఖి" కోసం పిలుపునిస్తూ ఫ్లైయర్‌లను ప్రసారం చేసింది. వాటన్నింటినీ కెనడా ప్రభుత్వం ఎప్పుడూ నిరోధించడానికి ప్రయత్నించలేదు. అలాగే, భారతీయ హిందువులపై జరిగి దాడులను కూడా ఆపలేదు.బంగ్లాదేశ్‌లో కూడా ఇటీవల హిందువులపై దాడులకు సంబంధించిన ఆందోళనలు పెరిగాయి. దీనిపై, అక్కడి తాత్కాలిక ప్రభుత్వ చీఫ్, నోబుల్ గ్రహీత మహ్మద్ యూనస్ స్పందిస్తూ? అలాంటి సంఘటనలు పెద్దగా జరగట్లేదన్నట్లే చెప్పారు. కెనడా ప్రధాని ట్రూడో మాదిరి యూనస్ కూడా బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పిస్తామంటూ హామిలిచ్చారు. ఇటు బంగ్లాదేశ్‌లో, అటు కెనడాలో హిందువులపై దాడులను చూస్తుంటే భవిష్యత్తు ఆందోళనకరంగా కనిపిస్తుంది. భారతదేశంపై ఉన్న ద్వేషాన్ని చూపించడానికి వాళ్ల దేశంలో పౌరులుగా ఉన్న హిందువులను హింసించడం అన్నది పౌర హక్కులకు భగం కలిగించడం మాత్రమే కాదు, ఇది మానవ హక్కులను కూడా కాలరాయడమే అవుతుంది. అంతకుమించి, రాజకీయ లబ్ధి కోసం తమ దేశ గౌరవాన్ని తగలబెట్టి, చలికాచుకోవడమే అవుతుంది.

## ఇసుక ర్యాంపులో రాత్రులు కూడా ఆగని తవ్వకాలు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం బడుగువానిలంక అనధికార ఇసుక ర్యాంపులో గత 15 రోజులుగా నిరంతరాయంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. బుధవారం రాత్రి 8 గంటలైనా ట్రాక్టర్ల పై ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. బుధవారం బడుగువానిలంక గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగినా ఇటువంటి పత్రాలు లేకుండా జరుగుచున్న ఈ అక్రమ రవాణా పై రెవెన్యూ శాఖ చూడకపోవటం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడుగువానిలంక అనధికార ర్యాంపులో ఒక్కొక్క ట్రాక్టర్కు 1000 రూపాయల నుండి 1500 వరకు వసూళు చేస్తున్నారు. కాగా ట్రాక్టర్ ద్వారా ఇసుకను గ్రామాలకు తరలించి మూడు నుండి నాలుగు వేల రూపాయల వరకు బహిరంగంగా అమ్మకాలు సాగిస్తున్నారు.

## అభయ యాప్ పై అవగాహన

ఏలూరు మహిళ పోలీసులు అభయ యాప్ పై ప్రజలకు విద్యార్థులకు స్థానిక ఆటో డ్రైవర్లకు విస్తృతమైన అవగాహన కల్పించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతి ప్రియా తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఏలూరు జిల్లా ఎస్పీ మహిళల భద్రత కోసం అభయ యాప్ ను జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఏలూరు రేంజ్ డీఐజీ ఐజి అశోక్ కుమార్ జిల్లా కలెక్టర్ సెల్వి జిల్లా జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి లు సంయుక్తంగా ప్రారంభించారు ఈ యాప్ ప్రధాన లక్ష్యం మహిళల రక్షణ మా కర్తవ్యం నినాదంగా ఉంది. ఈ నేపథ్యంలో మొదటి రోజు బుధవారం సాయంత్రం నుండి రాత్రి వరకు మహిళ పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతి ప్రియతమ సిబ్బందితో విస్తృతంగా ఈ యాప్ గురించి నగరంలో అవగాహన కల్పించారు.

# మహారాష్ట్రలో రెబల్స్ గుబుల్స్

ముంబై, నవంబర్ 7, (న్యూస్ పల్స్) మహారాష్ట్రలో నామినేషన్ గడువు సోమవారంతో ముగియడంతో ఆయా పార్టీలు రెబల్స్ ను ఉపసంహరింపజేయడంలో కొంత వరకు సఫలీకృతులయ్యారు. కానీ అన్ని పార్టీల నుంచి కొన్ని చోట్ల రెబల్స్ ససేమిరా అనడంతో తలపట్టుకుంటున్నారు.. నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తిరుగుబాటుదారులు (రెబెల్స్), ప్రత్యర్థులు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు దూరమయ్యారు.

మొత్తం 3,203 మంది అభ్యర్థులు ఎన్నికల నుంచి వైదొలిగారు. మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జరంగే-పాటిల్ అభ్యర్థులు, బీజేపీ మాజీ ఎంపీ గోపాల్ శెట్టి కూడా వైదొలిగారు. మహారాష్ట్రలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడనున్నాయి. గోపాల్ శెట్టి, స్వకృతి శర్మ, విశ్వజిత్ గైక్వాడ్, దాద్రావ్ కేచే, కరణ్ గైకర్, దిలీప్ కుమార్ భామ్రే వంటి పలువురు రెబల్స్ స్వతంత్ర నామినేషన్లను ఉపసంహరించుకునేలా బీజేపీ విజయవంతంగా ఒప్పించింది. దాని మిత్రపక్షం శివసేన తన తిరుగుబాటు ధన్‌రాజ్ మహాలేను డియోలాలీ నుంచి ఉపసంహరించుకునేలా చేసింది. ఇది ఎన్సీపీకి చెందిన నరహరి జిర్వాల్ అభ్యర్థిత్వానికి మద్దతిచ్చింది. మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) వైపు కాంగ్రెస్ రెబల్ ముక్తార్ షేక్, మధు చవాన్, ఆ పార్టీ అభ్యర్థి మధురిమా రాజే ఛత్రపతి వైదొలిగారు. పెన్, పన్వేల్, అలీబాగ్లలో మిత్రపక్షం పెసెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ (పీడబ్ల్యూపీ)కి మద్దతిస్తూ శివసేన (యూబీటీ) తన అభ్యర్థులను ఉపసంహరించుకుంది. కూటమి అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేస్తున్న రెబల్స్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్, నానా పటిల్ గట్టిగా హెచ్చరించిన నేపథ్యంలో వీరు ఉప సంహకరించుకున్నారు. ఒక సామాజికవర్గం ఆధారంగా ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం కాదని, స్వతంత్ర మరాఠా అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని జరంగే పాటిల్ విజ్ఞప్తి చేశారు. పార్వతి, దౌండ్ నియోజకవర్గాల్లో అభ్యర్థులకు మద్దతిచ్చిన మరుసటి రోజే ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఫూలంబ్రి, కన్నడ, హింగోలి, పఠారీ, హడ్‌గావ్ నియోజకవర్గాల్లో అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. మరాఠా కమ్యూనిటీ బయటకు వెళ్లి ఓటు వేయాలని విజ్ఞప్తి చేసిన ఆయన. దళితులు, ఇతర సంస్థలకు చెందిన అభ్యర్థుల జాబితాలో జాప్యం జరగడమే తాను ఎన్నికల పోటీ నుంచి వైదొలగడానికి కారణమని పేర్కొన్నారు.

బీజేపీ మాజీ ఎంపీ గోపాల్ శెట్టి కూడా సీనియర్ నేత వినోద్ తవాడేను కలిసిన తర్వాత పార్టీ కంచుకోట బోరివాలి నుంచి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. సంజయ్ ఉపాధ్యాయ్ ను బీజేపీ బరిలోకి దింపడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన షెట్టి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ముంబై నార్త్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2 సార్లు ఎంపీగా ఎన్నికైన ఆయనకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ టికెట్ నిరాకరించడంతో ఆయన స్థానంలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ను బరిలోకి దింపింది. 2014-2024 మధ్య లోక్ సభలో బీజేపీ తరఫున ప్రాతినిధ్యం వహించిన షెట్టి 1992-2004 మధ్య బీఎంసీ కార్పొరేటర్ గా, 2004-2014 మధ్య బోరివాలి ఎమ్మెల్యేగా పనిచేశారు.

రెబల్స్ ను ఎన్నికల పోటీ నుంచి తప్పుకునేలా ఒప్పిస్తామని డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. ఆ తర్వాత మరో ఇద్దరు రెబల్ అభ్యర్థులు విశ్వజిత్ గైక్వాడ్, స్వకృతి శర్మ ఉద్గీర్, అంధేరీ ఈస్ట్ నుంచి వైదొలిగారు. ఎన్సీపీకి చెందిన సంజయ్ బన్సోడేకు మద్దతు తెలిపిన గైక్వాడ్ ఫడ్నవీస్ ఆదేశాలతో వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ ప్రదీప్ శర్మ సతీమణి శర్మ కూడా శివసేన అభ్యర్థి ముర్జీ పటేల్ కు మద్దతుగా స్వతంత్ర అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు.

## నాసిక్ వెస్ట్ సీటు..

మహేశ్ హిరే, కరణ్ గైకర్, దిలీప్ కుమార్ భామ్రే, శశికాంత్ జాదవ్ వంటి పలువురు బీజేపీ రెబల్స్ తమ స్వతంత్ర నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో నాసిక్ వెస్ట్ స్థానానికి పోటీ సన్నగిల్లింది. సీపీఐ(ఎం) అభ్యర్థి ఉదయ్ నర్కర్ కూడా తన నామినేషన్ ను ఉపసంహరించుకోవడంతో బీజేపీకి చెందిన సీమా మహేష్ హీరే, సుధాకర్ బద్గుజారుల మధ్య ప్రత్యక్ష పోటీ నెలకొంది.

మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) పక్షాన కాంగ్రెస్ తిరుగుబాటు నేత ముక్తార్ షేక్ కస్బా పేట్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుని కూటమి అధికారిక అభ్యర్థి రవీంద్ర ధంగేకర్ కు మద్దతు పలికారు.

కస్బా పేట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీజేపీ అభ్యర్థి హేమంత్ నారాయణ్ రసానే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అభ్యర్థి గణేశ్ సోమనాథ్ భోక్రేతో తలపడనున్నారు.

కొల్హాపూర్ నార్త్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మధురిమా రాజే ఛత్రపతి గడువు ముగిసిన కొన్ని నిమిషాల ముందు తన నామినేషన్ ను ఉపసంహరించుకోవడంతో ఎంవీఏకు అధికారిక అభ్యర్థి లేకుండా పోయారు. కొల్హాపూర్ రాజకుటుంబానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మాలోజీ రాజే ఛత్రపతి సతీమణి మధురిమ రాజే ఛత్రపతిని రాజేష్ లట్కర్ కు బదులుగా కాంగ్రెస్ బరిలోకి దింపింది.

లత్కర్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి ఉప సంహకరణకు నిరాకరించడంతో, రాజకుటుంబం వారి బంధువులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. శివసేనకు చెందిన రాజేష్ క్షీర్సాగర్, లత్కర్, ఎంఎన్ఎస్ కు చెందిన అభిజిత్ దౌలత్ రౌత్ మధ్య ప్రత్యక్ష పోరు నెలకొంది.

మాహిమ్ లో ముక్కోణపు సేన పోరు నుంచి వైదొలగడానికి శివసేనకు చెందిన మహిమ్ ఎమ్మెల్యే సదా సర్వాంకర్ నిరాకరించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఎంఎన్ఎస్ వారసుడు అమిత్ ఠాక్రే, శివసేన (యూబీటీ) అభ్యర్థి మహేశ్ సావంత్ తో తలపడుతున్నారు.

# భారత్ కు బాసటగా అగ్రరాజ్యం

వాషింగ్టన్, నవంబర్ 7, (న్యూస్ పల్స్) అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. హోరాహోరిగా జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ తన సమీప ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలపై విజయం సాధించారు. అధ్యక్షుడిగా విజయం సాధించిన నేపథ్యంలో త్వరలో ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ గెలిచిన తర్వాత.. ప్రపంచం మొత్తం అతడి పరిపాలన ఎలా ఉండబోతుందో అంచనా వేస్తోంది. ఈ క్రమంలో భారత మీడియా కూడా ట్రంప్ పరిపాలించే విధానంపై విశ్లేషణ చేసింది. ముఖ్యంగా అమెరికా ? భారత సంబంధాలు ఎలా ఉంటాయోనని ఒక అంచనా వేసింది. ఎన్నికల ప్రచారం సమయంలో " అమెరికాకు సంబంధించి ఫారిన్ అఫైర్స్ ను పునరుద్ధరిస్తామని" ట్రంప్ పదే పదే ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైన తర్వాత.. తమ దేశానికి సంబంధించిన ప్రయోజనాల విషయంలో ట్రంప్ విశేషమైన ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా ఇరాన్ అణు ఒప్పందం, పారిస్ వాతావరణ ఒప్పందం అందులో ముఖ్యమైనవి. ఇక కీలకమైన అంతర్జాతీయ ఒప్పందాలను కూడా ట్రంప్ వివిధ దేశాలతో కుదుర్చుకున్నారు. కొన్ని దేశాలతో స్నేహపూర్వకంగా మెలిగారు. మరికొన్ని దేశాలతో యుద్ధ వాతావరణం కొనసాగించారు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఏ విధానాన్ని అయినా సరే ట్రంప్ తోసిపుచ్చారు. ఇప్పుడు మళ్లీ అమెరికాను అగ్ర పథం లో నిలబెడదామని ట్రంప్ ఎన్నికల సమయంలో పదేపదే వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ట్రంప్ మరొకసారి అమెరికా అధ్యక్షుడైన తర్వాత.. భారతదేశంలో సహా ఇతర దేశాలతో అమెరికా కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దౌత్యం, వలసలు, వాణిజ్యం, సైనిక సహకారం వంటివి ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం.భారత్ అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు ఎన్నో సంవత్సరాల నుంచి సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల అమెరికా నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులపై అత్యధిక సుంకాలను విధిస్తున్నారని ట్రంప్ మండిపడ్డారు. తాము కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదే విధంగా వసూలు చేస్తామని హెచ్చరించారు. అయితే ఈ జాబితాలో భారత్ కు మినహాయింపు లభించే అవకాశం ఉండకపోవచ్చు.. భారత్ గొప్ప దేశమని, మిత్ర దేశమని, మోడీ తనకు మంచి మిత్రుడని, గొప్ప నాయకుడని ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పన్నుల విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రకారం చేసుకుంటే ట్రంప్ ఎలా వ్యవహరిస్తారు అనే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు.మన దేశం నుంచి అమెరికాకు ఉద్యోగాల నిమిత్తం అనేకమంది వెళ్తుంటారు. హెచ్ -1 బీ వీసాల మీదుగా వారు అమెరికాకు వెళ్తుంటారు. మన దేశానికి చెందిన ఐటీ కంపెనీలు ఇలా అమెరికాకు పంపిస్తుంటాయి. ఈ క్రమంలో ఈ విధానాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడే అమెరికా జీతాలతో సమానంగానే హెచ్ ? 1 బీ వీసా దారులకు ఇవ్వాలని ప్రతిపాదన వచ్చింది.అమెరికా భారత్ మధ్య సైనిక ఒప్పందాలు ఎప్పటినుంచో ఉన్నాయి. బైడన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇవే కాకుండా క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఒప్పందం కూడా రెండు దేశాల మధ్య జరిగింది. అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నప్పటికీ పసిఫిక్ ప్రాంతంలో చైనా ను నిలువరించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే రెండు దేశాల మధ్య సైనిక సహకారం కొనసాగే అవకాశం కనిపిస్తోంది. రెండు దేశాల ఉమ్మడి లక్ష్యానికి క్వాడ్ కూటమి కూడా సహకరించే అవకాశం కనిపిస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అనేక సందర్భాల్లో తన వాణి వినిపించిన ట్రంప్.. పాకిస్తాన్ తో చేస్తున్న పోరాటంలో భారత్ కు సహకరించవచ్చని తెలుస్తోంది.

# డొనాల్డ్ ట్రంప్ జీతం ఎంతో తెలుసా, సౌకర్యాలు

## నెలకు 3.3 కోట్ల రూపాయిల జీతం



వాషింగ్టన్, నవంబర్ 7, (న్యూస్ పల్స్) అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఆ ప్రయోజనాలు అద్భుతంగా ఉంటాయి.అమెరికా అధ్యక్షుడు వైట్ హౌస్ లో నివాసం ఉంటారు. అక్కడ 24/7 పాటు సెక్యూరిటీ ఉంటుంది. ఈగ కూడా వాలనివ్వకుండా సెక్యూరిటీ సిబ్బంది చూసుకుంటారు.. అమెరికా అధ్యక్షుడికి వార్షిక వేతనంగా నాలుగు లక్షల డాలర్ల వేతనం లభిస్తుంది. భారతీయ కరెన్సీ ప్రకారం చూసుకుంటే అది 3.3 కోట్ల వరకు ఉంటుంది. ఆ మొత్తాన్ని ఇవ్వాలని 2001లో అమెరికా కాంగ్రెస్ నిర్ణయించింది. అప్పటినుంచి అమెరికా అధ్యక్షుడి వేతన విషయంలో ఎటువంటి మార్పు లేదు. ఇక అమెరికా అధ్యక్షునిగా పనిచేసి.. రిటైర్ అయిన వారికి ప్రయోజనాల రూపంలో ప్రతి ఏడాది రెండు లక్షల డాలర్లు లభిస్తాయి. ఇతర అలవెన్స్ ల కింద లక్ష డాలర్లు అందుతాయి. వేతనం మాత్రమే కాకుండా అధికారిక ఖర్చులకోసం, వ్యక్తిగత ఖర్చులకోసం జీతంతో పాటు 50 వేల డాలర్లు లభిస్తాయి. అయితే ఇవి పన్ను రహితంగా ఉంటాయి. ప్రయాణ ఖర్చులకు 1,00,000 డాలర్లు లభిస్తాయి. అధ్యక్షుడు వినోదం కోసం 19 వేల డాలర్లు అందుతాయి. ఈ ప్రకారం చూసుకుంటే అధ్యక్షుడికి ప్రతి సంవత్సరం 5.69 లక్షల డాలర్లు లభిస్తాయి. కొత్త అధ్యక్షుడు వైట్ హౌస్ లో అడుగు పెట్టడానికి ముందు దానిని అందంగా అలంకరిస్తారు. దీనికోసం లక్ష డాలర్లు వెచ్చిస్తారుఇక అమెరికా అధ్యక్షుడు నివాసముండే వైట్ హౌస్ ను 1800 సంవత్సరంలో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవన సముదాయం 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. ఇందులో 132 గదులు ఉన్నాయి. 35 బాత్ రూం లు ఉన్నాయి. ఇందులో టెన్నిస్ కోర్టు ప్రత్యేకంగా ఉంటుంది. జాగింగ్ ట్రాక్ అధునాతనంగా ఉంటుంది. మూవీ థియేటర్, ఈతకొలను వంటి సదుపాయాలు కూడా ఉంటాయి. అధ్యక్షుడి కోసం ఇక్కడ నిత్యం ఐదుగురు వంటవాళ్లు పనిచేస్తుంటారు. అధ్యక్షుడు కోరుకున్న విధంగా వంటలు వండి సర్వ్ చేస్తుంటారు.వైట్ హౌస్ మాత్రమే కాకుండా అమెరికా అధ్యక్షుడికి బ్లయిర్ హౌస్ అనే గెస్ట్ హౌస్ కూడా ఉంటుంది. ఇది వైట్ హౌస్ కంటే చాలా పెద్దది. 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. ఇందులో 119 గదులు ఉంటాయి. గెస్ట్ ల కోసం 20 పడక గదిలో ఉంటాయి. 35 స్నానాల గదులు ఉంటాయి. ఇందులో నాలుగు డైనింగ్ హాల్స్, జిమ్, సెలూన్ వంటివి కూడా ప్రత్యేకంగా ఉంటాయి.అమెరికా అధ్యక్షుడు కోసం క్యాంప్ డేవిడ్ పేరుతో హిల్ గెస్ట్ హౌస్ కూడా ఉంటుంది. ఇది మేరీ ల్యాండ్ రాష్ట్రంలో 128 ఎకరాలలో విస్తరించి ఉంది. హిల్ గెస్ట్ హౌస్ ను మొదట రుజ్ వెల్ట్ ఉపయోగించాడు. దీనిని ఎక్కువగా దౌత్యపరమైన విషయాలు చర్చించడానికి ఉపయోగిస్తారు.. అప్పట్లో ఈ కేంద్రం వేదికగానే ఈజిప్టు ? ఇజ్రాయిల్ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిని క్యాంపు డేవిడ్ ఒప్పందం అని కూడా పిలుస్తారు.అమెరికా అధ్యక్షుడు ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తారు. ఇందులో అనేక సౌకర్యాలు ఉంటాయి. ఈ విమానం గాలిలో ఉండగానే ఇంధనం నింపుకుంటుంది. ఇక మెరైన్ వన్ అనే హెలికాప్టర్ అమెరికా అధ్యక్షుడికి సేవలు అందిస్తుంది. ఇది గంటకు 241 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. బాంబు పేలుళ్లను కూడా ఇది తట్టుకుంటుంది. దీనికి మూడు ఇంజిన్లు ఉంటాయి. ఒక్కటి విఫలమైనా మిగతా రెండు ఇంజన్లతో ఆ హెలికాప్టర్ నడుస్తుంది. అయితే ఇలాంటి హెలికాప్టర్లు ఐదు ఉన్నాయి. శత్రువుల నుంచి అధ్యక్షుడిని కాపాడేందుకు ఇలా హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు.ఇక అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే కారు పేరు బీస్ట్. ఇది అద్భుతమైన ఫీచర్లను కలిగి ఉంటుంది. అత్యంత భారీ భద్రత ప్రమాణాలతో దీనిని రూపొందించారు. అమెరికా అధ్యక్షుడు తను వెళ్లిన ప్రతి దేశానికీ.. ఈ కారు పరుగులు పెడుతుంటుంది. అమెరికా అధ్యక్షుడు మాత్రమే కాదు.. వారి కుటుంబ సభ్యులకు ఈ కారులో 24/7 అత్యంత రహస్య భద్రత ఉంటుంది.

# కేటీఆర్ ఎందుకు అలా...



హైదరాబాద్, నవంబర్ 7, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా ఉంటాం. వసూళ్ల కోసమే రేవంత్ రెడ్డి హైడ్రాను తీసుకొచ్చారు' అని నిన్న కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. ఏదైనా దూరం అయితేనే తెలుస్తుందన్నట్లు.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో కేటీఆర్ ఇలా మాట్లాడడం అందరినీ ఆశ్చర్యపరిచింది.రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా ఉంటాం. వసూళ్ల కోసమే రేవంత్ రెడ్డి హైడ్రాను తీసుకొచ్చారు' అని నిన్న కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. ఏదైనా దూరం అయితేనే తెలుస్తుందన్నట్లు.. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో కేటీఆర్ ఇలా మాట్లాడడం అందరినీ ఆశ్చర్యపరిచింది. బీఆర్ఎస్ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నట్లు ఆయన మాట్లాడుకొచ్చారు. బీఆర్ఎస్ లేకపోవడం వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన మాటల ద్వారా చెప్పకనే చెప్పారు. మార్పు కోసం అంటూ కాంగ్రెస్ ను గెలిపిస్తే ఎలాంటి మార్పులు వచ్చాయో చూస్తున్నారు కదా అని వ్యాఖ్యలు చేయడం చర్చకు దారితీసింది. ఈ వ్యాఖ్యలతో ఆందోళనలు చేస్తున్న వారిలో మరో రకం చర్చ మొదలైంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ ఆందోళనలు జరిగాయి కదా.. మరి వాటి గురించి అప్పుడు ఎందుకు పట్టించుకోలేదు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేస్తున్న ఆందోళనలకు ఎక్కడి నుంచో వచ్చి ఎందుకు మద్దతు తెలుపుతున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రౌండ్ లెవల్‌లో ఆ పరిస్థితి ఉన్నదా అన్నది ఎవరూ క్లారిటీగా చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే.. నిన్న ఆటో డ్రైవర్ల మహాధర్నా కార్యక్రమానికి హాజరైన కేటీఆర్‌కు చేదు అనుభవం ఎదురైంది. అక్కడికి వెళ్లిన కేటీఆర్‌ను ఆటోడ్రైవర్లు నిలదీశారు. పిలవకుండా ఎలా వచ్చారంటూ అవమానించారు. దాంతో కేటీఆర్ ఖంగుతిన్నారు. మహాలక్ష్మి స్కీమ్ వల్ల నష్టపోతున్నామని ఆటోడ్రైవర్లు ఈ ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. అయినప్పటికీ వారికి మద్దతు తెలుపుతానంటూ కేటీఆర్ మరీ ఆటోలో వచ్చారు. కానీ.. కేటీఆర్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. కేటీఆర్ కొన్ని దురుసు వ్యాఖ్యలు చేశారు.కేటీఆర్ ఇప్పుడున్న సందర్భాల్లో సమావేశాలకు పిలిచినా పిలవకపోయినా అన్నింటికీ హాజరవుతున్నారు. దాంతో నిన్న అనూహ్యంగా ఆటోడ్రైవర్ల నుంచి నిరసన వ్యక్తం కావడంతో ఆయన ఒక్కసారిగా ఫైర్ అయ్యారు. అయితే.. కేటీఆర్ హాజరైన ప్రతి సమావేశాల్లోనూ దురుసుగా మాట్లాడుతున్నారన్న టాక్ ఉంది. ఎదుట వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారన్న అభిప్రాయమూ వ్యక్తం అవుతోంది. ఎవరు ఆందోళనలు చేస్తున్నా వారి దగ్గరకు అవే మాటలు మాట్లాడుతున్నారని అభిప్రాయాలూ వ్యక్తం అవుతున్నాయి. మార్పు కోరుకొని ఇప్పుడు ఏం సాధించారని ఎక్కడికెళ్లినా ప్రశ్నిస్తున్నారు. అయితే.. ఆందోళనలు గత ప్రభుత్వ హయాంలోనూ చేశారు. ఇప్పుడూ కొనసాగిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతీ ప్రభుత్వంలో కూడా ఏవో వర్గాలు రోడ్డెక్కుతూనే ఉంటాయి. అయితే.. అది ప్రభుత్వ వైఫల్యం అని చెప్పకనే తప్పదు. అంటే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసినప్పుడు కూడా అది ప్రభుత్వ వైఫల్యాలే కదా. దాంతో ఇప్పుడూ అదే చేస్తున్నారు. ఇది కాస్త కేటీఆర్‌కు తెలియకుండా పోయింది. దానిని గుర్తించకుండా కేటీఆర్ మాత్రం ఎక్కడ పడితే అక్కడకు ఆందోళనలకు హాజరుకావడం ఇప్పుడు ఆందోళనకు గురిచేస్తోంది. అటు పార్టీ కేడర్ కూడా కేటీఆర్ తీరుపై అసంతృప్తితో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పిలవకుండా ఆందోళనలకు వెళ్లడంపైనా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని వినిపిస్తోంది. కేటీఆర్ వైఖరిని సైతం తప్పుపడుతున్నారని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికైనా కేటీఆర్ తన వైఖరి మార్చుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# స్కూల్ ప్లే గ్రౌండ్ ను కాపాడుకున్న లిటిల్ సోల్జర్స్

హైదరాబాద్, నవంబర్ 7, గుడినే కాదూ.. గుడిలో లింగాన్ని మాయం చేస్తోన్న జమానా ఇది. ఇక బడి ఓ లెక్కా. అవును.. హైదరాబాద్ నాగోల్‌లోని ఓ స్కూల్ జాగాపై కన్నేసిన కబ్జాకోరు.. గజాల చొప్పున లెక్కగట్టి ఆక్రమణకు స్క్రీన్ ప్లే రచించాడు. అనుకున్నట్టే ప్రహరీ గోడను కూల్చేశాడు. అంతలోనే బడి పిల్లలంతా ఎదురు తిరిగారు. మా స్కూల్ మాగ్గావాలి అంటూ కదం తొక్కారు. నాగోల్ బండ్లగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 74ఏళ్ల చరిత్ర ఉంది. మరో ఏడాదైతే వజ్రోత్సవ సంబరాలు జరుపుకోవాల్సిన సమయం. కానీ ఏం లాభం? ఓ ప్రైవేట్ వ్యక్తి ఈ సర్కార్ స్కూల్‌పై కన్నేశాడు. దసరా సెలవుల్లో పోలీస్ ప్రొటెక్షన్‌తో వచ్చి కాంపౌండ్ వాల్‌ని కూల్చేశాడు. కూలిన గోడల్ని చూసి విద్యార్థులంతా భోరుమన్నారు. మా స్కూల్ మాక్కావాలంటూ రోడ్డెక్కారు. ప్లేట్లను చేతుల్లోకి తీసుకుని నినదించారు. కళ్లకు గంతలు కట్టుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు. ఏళ్ల తరబడి ఈ స్కూల్‌కి సొంత భవనం లేదు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా అందుకు తగ్గ వసతులు లేవు. రేకులతో కూడిన రెండు షెడ్లు.. ఓ వరండాలోనే క్లాస్‌లు జరుగుతున్నాయి. స్కూల్ దీనస్థితిని గమనించిన అధికారులు.. 1998లో బండ్లగూడ సర్వే నంబర్ 36/6లోని ప్రభుత్వ స్థలంలో 1.09 ఎకరాలను కేటాయించారు. తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల భవన నిర్మాణ పను?ల ప్రారంభించారు. గోడలు నిర్మిస్తుండగానే 2000లో కొందరు వ్యక్తులు అది తమ ఆస్తిగా పేర్కొంటూ కోర్టుకెళ్లారు2012లో అప్పటి తహశీల్దార్ సర్వే చేపట్టి.. ప్రభుత్వ భూమిగా నివేదిక సమర్పించడంతో కోర్టు ప్రభుత్వ భూమిగా తేల్చింది. ఆ తర్వాత సర్వశిక్ష అభయాన్ ఆధ్వర్యంలో స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. తరగతి గదుల నిర్మాణానికి పునాదుల దిమ్మెలు వేశారు. అంతలోనే మరోసారి ప్రైవేటు వ్యక్తులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటినుంచి ఎన్నో ఇబ్బందుల మధ్య విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన 1.09ఎకరాల భూమి విలువ ప్రస్తుతం రూ.20కోట్ల వరకు ఉంటుంది. మూడు వైపుల ప్రభుత్వ స్థలం.. ఓ వైపు రోడ్డు ఉంటే అది ప్రైవేట్ వ్యక్తులది ఎలా అవుతుందని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదే స్కూల్‌లో మేం చదువుకున్నాం.. మా పిల్లల్ని చదివిస్తున్నాం. అయినా కబ్జా పీడ మాత్రం వదలడం లేదంటున్నారు. స్కూల్‌కి సంబంధించిన హద్దులు, రికార్డులు పక్కాగా ఉన్నా.. అధికారుల నిర్లక్ష్యమే కబ్జాకోరులకి వరంగా మారుతుందనే ఆరోపణలు ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలంటున్నారు స్థానిక నేతలు. స్కూల్‌ని కాపాడే బాధ్యత తీసుకుంటామన్నారు లోకల్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి. పక్కా రికార్డులు కోర్టులో సమర్పించి.. ప్రైవేట్ వ్యక్తుల ఆర్డర్ రద్దయ్యేలా చూస్తామన్నారు.ఉప్పల్, నాగోల్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మధ్య కాలంలో అనూహ్యంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇదో శుభపరిణామం అనే చెప్పాలి. ఇలాంటి అవకాశాలను రెండు చేతులా ఒడిసిపట్టుకుని పిల్లలకు విద్యనందించాలి. కానీ పాఠాలు చెప్పే పరిస్థితి లేకుండా చేస్తే ఎలా? కబ్జాకోరులు దర్జాగా బడి స్థలాన్ని మింగేస్తుంటే చూస్తూ ఉండిపోవాల్సిందేనా? ఈ మధ్య ఎంట్రీ ఇచ్చిన హైడ్రా.. స్కూల్ ఆక్రమణపై దృష్టి సారించాలంటున్నారు స్థానికులు. ఎక్కడెక్కడో నిర్మాణాలను కూల్చేస్తున్నారు. కానీ ఇక్కడి కబ్జారాయుళ్లపై ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని స్కూల్ నిర్మాణం వేగవంతం చేయాలంటున్నారు నాగోల్‌వాసులు.

# మంత్రుల మధ్య హెలికాప్టర్ ఫైట్

హైదరాబాద్, నవంబర్ 7,ఉన్నది ఒక్కటే హెలికాప్టర్. సీఎం సహా 11మంది మంత్రులు ఏ లాంగ్ టూర్‌కు వెళ్ళినా ఆ హెలికాప్టర్‌ను వాడాలి. అయితే కొందరు మంత్రులకు హెలికాప్టర్ ఇచ్చి..మరి కొందరికి మాత్రం హెలికాప్టర్ ఇవ్వకపోవడంతో రచ్చ స్టార్ట్ అయిందట. ఇదేంటి మేము మంత్రులం కాదా..మాకు హెలికాప్టర్ వాడే అర్హత లేదా..నాకు హెలికాప్టర్ ఇవ్వొద్దని నీకు ఎవరు చెప్పారు అంటూ అధికారుల మీద గుస్సా అవుతున్నారట మంత్రులు. ప్రోటోకాల్ ప్రకారం సీఎం ప్రభుత్వ హెలికాప్టర్‌ను యూజ్ చేస్తున్నారు. సీఎం పర్యటనలు లేనప్పుడు, హెలికాప్టర్ ఖాళీగా ఉంటే మంత్రులు ఉపయోగించే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక మంత్రి కాకుండా ఇద్దరు ముగ్గురు మంత్రులు, ఉన్నతాధికారులు కలసి..హైదరాబాద్‌కు దూరంగా ఉన్న జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావాల్సి వచ్చినప్పుడు హెలికాప్టర్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంటుందట. అందుకు ప్రత్యేకంగా నిబంధనలు ఏమీ లేవని అధికారులు చెబుతున్నారు.కొన్ని కీలక శాఖలు నిర్వహిస్తున్న మంత్రులు తరచూ హెలికాప్టర్‌ను వాడుతున్నారు. దూర ప్రాంతాలకే కాదు దగ్గరలో ఉన్న జిల్లాలకు కూడా హెలికాప్టర్‌లోనే వెళ్తున్నారు. నలుగురైదుగురు మంత్రులు మాత్రమే రెగ్యులర్‌గా హెలికాప్టర్ వాడుకోవడం, మిగతా మంత్రులకు ఆ అవకాశం రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం అవుతోందట. వెసులుబాటును బట్టి అత్యవసరం అయితే తప్ప, లేకపోతే మంత్రుల బృందం వెళ్లే ప్రత్యేక సందర్భాల్లో సర్కార్ హెలికాప్టర్‌ను ఉపయోగిస్తుంటారని అధికారులు చెబుతున్నారు. కానీ కొంతమంది మంత్రులు సాధారణ ప్రభుత్వ కార్యక్రమాలకు, హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న జిల్లాలకు కూడా హెలికాప్టర్‌లో వెళ్తున్నారటమంత్రులు హెలికాప్టర్‌ను వాడుకునేందుకు ఎవరికి అభ్యంతరం లేదు. కానీ..కొందరికి మాత్రమే హెలికాప్టర్ ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయట. కొంతమంది మంత్రులు దూరంలో ఉన్న జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్లాల్సి వచ్చినా హెలికాప్టర్ ఇవ్వడం లేదని వాపోతున్నారట. దీంతో కొందరికి మాత్రమే హెలికాప్టర్‌లో వెళ్లే వెసులుబాటు కల్పించి, మిగతా వారి పట్ల వివక్ష చూపుతున్నారని ప్రోటోకాల్ అధికారులపై మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

అంతేకాకుండా మిగతా మంత్రులు తరచూ హెలికాప్టర్ వాడుకోవడం, హైదరాబాద్ దగ్గర ప్రాంతాలకు కూడా హెలికాప్టర్‌లో వెళ్లడంపై ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఇదే విషయాన్ని ఓ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. అప్పటి నుంచి రెగ్యులర్‌గా హెలికాప్టర్ వాడే మంత్రులు కూడా ఇప్పుడు రోడ్డు మార్గంలోనే వెళ్తున్నారని తెలుస్తోంది.

ఈ మార్పునకు సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షనే కారణమా లేక ఇంకేదైనా రీజన్ ఉందా అన్నది మాత్రం అధికారులు చెప్పడం లేదు. మొత్తానికి హెలికాప్టర్ విషయంలో మంత్రుల మధ్య వచ్చిన పొరపొచ్చాలకు ఫులిస్టాప్ పడినట్టేనని తెలుస్తోంది.

# కేటీఆర్ పాదయాత్ర కు క్లియెరెన్స్

హైదరాబాద్, నవంబర్ 7, భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర చేసేందుకు సిద్ధం అవుతున్నారని టాక్ నడుస్తుంది. ఓటమి తర్వాత కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమవ్వడంతో పార్టీలో అన్ని తానై వ్యవహరిస్తున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్ కే పరిమితం అవుతున్నారన్న అభిప్రాయం ఉంది. కేటీఆర్ జిల్లా పర్యటనల పైన దృష్టి సారించడం లేదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు. పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీష్ రావు జిల్లాల పర్యటనలు , కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. రైతు నిరసనల పేరుతో హరీష్ రావు జిల్లా పర్యటనలకు శ్రీకారం చుట్టారు. హరీశ్ దూకుడుతో వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ వెనుక పడిపోతున్నారని చర్చ జరుగుతోంది.డ్యామేజ్‌ను కంట్రోల్ చేయడానికే కేటీఆర్ రైతు నిరసన రాగం ఎత్తుకుని చేవెళ్ళ నియోజకవర్గంలో దీక్ష చేపట్టారంటున్నారు. అయితే పార్టీలో నెంబరు టూ అనిపించుకోవడానికి కేటీఆర్ ప్రదర్శిస్తున్న దూకుడు తాజాగా అభాసుపాలైంది. పిలవని పేరంటానికి వెళ్లినట్లు హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్ల మహాధర్నాకు అటెండ్ అవ్వడానికి కేటీఆర్ రెడీ అవ్వడంపై ఏఐటీయూసీ నేతలు మండిపడుతున్నారు. కేటీఆర్‌ను రమ్మని తాము పిలువలేదన్నారు. రాజకీయ లబ్ధి పొందడానికే కేసీఆర్ వచ్చేందేకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారుబీఆర్ఎస్‌లో బావబామ్మరుదల మధ్యపోటీ మొదటి నుంచి కొనసాగుతుంది. కేసీఆర్ తరువాత ఎవరు కీలకం కానున్నారనే చర్చ పొలిటికల్ సర్కిల్లో జోరుగా సాగుతుంది. కేసీఅర్ తరువాత బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్, హరీష్‌రావులే కీలకం. హరీశ్ రావుకు జిల్లాల్లో పట్టున్న నేతగా పేరుంటే , వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నటువంటి కేటీఆర్ గ్రేటర్ హైదరాబాద్‌కే పరిమితం అవుతున్నారన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు.ఇలాంటి తరుణంలో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర అంశాన్ని తెరపైకి తెచ్చారు కేటీఆర్. పాదయాత్రపై అధికారంగా ప్రకటన చేయనప్పటికీ.. ప్రజల్లో విస్తృతంగా చర్చ నడిలా సోషల్ మీడియాలో కేటీఆర్ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. పాదయాత్రపై అధికార ప్రకటన చేయకుండా.. ప్రచారాన్ని మాత్రం స్టార్ట్ చేయడం వెనక ఉన్న వ్యూహం ఏంటనేది అంతుపట్టకుండా తయారైంది. గ్రేటర్ ప్రాంతానికే కేటీఆర్ పరిమితం అయ్యారనే టాక్ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా తన ఇమేజ్‌ను పెంచుకునేందుకే పాదయాత్ర ప్లాన్ చేస్తున్నారనే టాక్ పార్టీ వర్గాల్లో ఉంది.అయితే కేటీఆర్ నిజంగా పాదయాత్రకు రెడీ అయితే? తమ నేత కూడా యాత్ర చేపడతారని హరీష్‌రావు వర్గీయులు సంకేతాలు ఇస్తున్నారు . కేటీఆర్ ఉత్తర తెలంగాణలో పాదయాత్ర మొదలు పెడితే దక్షిణ తెలంగాణ నుంచి హరీష్ రావు పాదయాత్ర స్టార్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఏదేమైనా కేసీఅర్ ఏదో ఒక నిర్ణయం తీసుకునే దాక ఇద్దరు నేతల మద్య పోటీ ఇలానే కొనసాగే అవకాశం ఉందంటున్నారు.రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీదే అధికారం .. మళ్ళీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ , హరీష్ రావు పదేపదే చెప్తున్నారు. అయితే కేసీఆర్ ఆరోగ్య రీత్యా ఆయన ఫాం హౌస్ కే పరిమితం అవుతున్నారని, ముమ్ముందు కూడా అదే పరిస్థితి ఉండవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. దాంతో రానున్న రోజుల్లో గులాబీబాస్ తన రాజకీయ వారసత్వాన్ని ఎవరికి కట్టబెడతారన్న చర్చ నడుస్తుది.

ఒకవైపు మేనల్లుడు, మరోవైపు కొడుకు ఈ ఇద్దరు నేతల్లో ఎవరికో ఒకరికి పార్టీ పగ్గాలు ఇవ్వాలి కాబట్టి.. ఆయన కొడుకు వైపే మొగ్గు చూపే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ అదే జరిగితే హరీష్ రావు తీసుకునే నిర్ణయం పైన ఉత్కంఠ నెలకొంది . కేసీఆర్ మాటను తూచ తప్పకుండా పాటిస్తాను అని చెప్పే హరీష్ రావు ఆయన ఎటువంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటారా అనేది అనేది చర్చనీయాంశంగా మారిందిఇలాంటి పరిస్థితుల్లో అసలు కేటీఆర్ పాదయాత్రకు కేసీఆర్ క్లియరెన్స్ ఇస్తారా? ఇచ్చి లేనిపోని తలనొప్పి కొనితెచ్చుకుంటారా అన్నది తేలాల్సి ఉంది.

తండ్రి అనుమతితో కేటీఆర్ పాదయాత్ర మొదలుపెడితే.. రాష్ట్రంలో రెండో మూల నుంచి హరీష్‌రావు పాదయాత్ర కూడా ప్రారంభం అవ్వడం ఖాయమన్న అభిప్రాయం ఉంది. అలా జరక్కుండా ఉండాలంటే కేటీఆర్ పాదయాత్రకు కేసీఆర్ రూట్ క్లియరెన్స్ ఇచ్చి.. హరీష్ రావుకి వ్యూహాత్మకంగా వేరే బాధ్యతలు కట్టబెట్టే అవకాశముందంటున్నారు. మరి చూడాలి బావబామ్మరుదుల ఆధిపత్య పోరు ఎటు నుంచి ఎటు దారితీస్తుందో.

# హైదరాబాద్ లో ఠాగూర్ ట్రీట్మెంట్

హైదరాబాద్, నవంబర్ 7,ఠాగూర్ సినిమాను ఎవరూ మరిచిపోరు. చనిపోయిన శవానికి ఎన్ని డబ్బులైనా ఇస్తాం బతికించుమంటే కార్పొరేట్ ఆస్పత్రి చేసిన నిర్వాకాన్ని మన చిరంజీవి కళ్లకు కట్టినట్టు చూపించాడు. ఇప్పుడే అదే సీన్ హైదరాబాద్ లో రిపీట్ అయ్యింది

సినిమాను ఎవరూ మరిచిపోరు. చనిపోయిన శవానికి ఎన్ని డబ్బులైనా ఇస్తాం బతికించుమంటే కార్పొరేట్ ఆస్పత్రి చేసిన నిర్వాకాన్ని మన చిరంజీవి కళ్లకు కట్టినట్టు చూపించాడు. ఇప్పుడే అదే సీన్ హైదరాబాద్ లో రిపీట్ అయ్యింది. జూనియర్ వైద్యురాలి ప్రాణం తీసింది. ఆమె తరుపు వారు డబ్బులు కట్టకుంటే చికిత్స ఆపేసి అనంతరం చనిపోయినా కూడా బతికి ఉందని నాటకమాడి లక్షలు గుంజేసిన ఓ ఆస్పత్రి దారుణం వెలుగుచూసింది. పైసలు పీక్కుతునే ఈ కార్పొరేట్ ఆస్పత్రుల ఆగడాలు మరోసారి ఓ కుటుంబాన్ని చిదిమేశాయి.శవాలతోనూ పైసలు సంపాదించడం అంటే ఇదేనేమో. ఓ వైపు బిడ్డను కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని చూసి జాలి చూపాల్సింది పోయి.. మిగిలిన డబ్బు కట్టి శవాన్ని తీసుకువెళ్లండని చెప్పడం ఆందోళనకు దారితీసింది. హైదరాబాద్ హైటెక్ సిటీ పరిధిలో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కార్పొరేట్ ఆసుపత్రుల్లో పరిస్థితులను మరోసారి ఈ ఘటన చాటిచెప్పింది. అనారోగ్యానికి గురైన జూనియర్ డాక్టర్ నాగప్రియను ఆమె కుటుంబసభ్యులు హాస్పిటల్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. అప్పటికే ఆమెకు ట్రీట్మెంట్ కోసం ఫ్యామిలీ మెంబర్స్ రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంకా రూ.4 లక్షలు బిల్లు పెండింగ్‌లో ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతో ఆ డబ్బులు కట్టిన తరువాతనే డెడ్ బాడీ ఇస్తామని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. దీంతో బాధితులు ఎమ్మెల్యే గాంధీతో చెప్పించారు. అయినప్పటికీ ఆస్పత్రి యాజమాన్యం వినిపించుకోలేదు.అయితే.. ముందు రోజు అర్ధరాత్రి ఫోన్ చేసి రూ.మూడు లక్షలు కట్టాలని, లేదంటే ట్రీట్మెంట్ నిలిపివేస్తామంటూ ఆస్పత్రివర్గాలు నాగప్రియ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తెలిపాయి. ఉదయాన్నే వారు అలా ఇలా సమకూర్చి మరో లక్ష పే చేశారు. కానీ.. ఆ తరువాత నాగప్రియ చనిపోయింది. మిగతా డబ్బు అంటూ ఆస్పత్రి వర్గాలు బెట్టు వీడలేదు. ఆ డబ్బులు చెల్లించాకనే శవాన్ని ఇస్తామని ఖరాఖండిగా చెప్పారు. అయితే.. తమ కూతురికి వైద్యం చేయడం ఆపేయడం వల్లనే చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో ఆస్పత్రి పరిసరాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

# కేటీఆర్ చుట్టూ బిగుసుకుంటున్న ఫార్ములా ఈ రేసు స్కాం

హైదరాబాద్, నవంబర్ 7 ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందని అనుమానిస్తున్న కేసులో ఏసీబీ దూకుడుగా దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం కొరడా విసురుతోంది. రాష్ట్రంలో జరిగిన పలు స్కాములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్ల అంశం, లిక్కర్ పాలసీ కేసు ఇలా పలు అంశాలపై గత ప్రభుత్వం అవినీతి ఆరోపణలు ఎదురుకుంటోంది. వీటిలో లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కొన్ని నెలల పాటు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో కేసీఆర్ ను విచారణకు ఆహ్వానించినప్పటికీ ఆయన వెళ్లలేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుగుతుండగా గత ప్రభుత్వంలో పనిచేసి ఆరోపణలు ఎదురుకున్న అధికారి విదేశాల్లో ఉన్నారు. ఫార్ములా ఈ-రేసింగ్‌కు సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు అక్రమంగా చెల్లించినట్లు గుర్తించారు. మున్సిపల్ శాఖ వద్ద రికార్డుల ఆధారంగా విదేశీ సంస్థలు, ప్రతినిధులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఫార్ములా ఈ-రేసింగ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన గత ప్రభుత్వంలోని పెద్దలకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ రేసు వ్యవహారం మొత్తం కేటీఆర్ కనుసన్నల్లో జరగడంతో ఆయనకే నోటీసులు ఇస్తారని అంటున్నారు. ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో చోటుచేసుకున్నఅక్రమాలపై విచారణకు అవినీతి నిరోధక శాఖకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రేస్‌లో రూ.55 కోట్లు ఎలాంటి అనుమతులు లేకుండా తరలించారు. ఐఏఎస్‌లు సహా అప్పటి బీఆర్ఎస్ సర్కారు పెద్దల ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. నుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ వెంటనే విచారణ ప్రారంభించింది. కేసుతో సంబంధం ఉన్నవారందరికీ విడివిడిగా నోటీసులు ఇచ్చి, విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నారు. ఐఏఎస్‌లు మొదలు కీలక అధికారులు, నాటి ప్రజాప్రతినిధుల దాక వీరిలో ఉండే అవకాశం ఉంది. స్టేట్‌మెంట్ ఆధారంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆదేశిస్తేనే విదేశీ సంస్థలకు నిధులు విడుదల చేశామని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారిగా పని చేసిన అర్వింద్ కుమార్ కేటీఆర్ నోటి మాట ద్వారా ఆదేశించడంతోనే నిధులు ఇచ్చామని అంటున్నారు. మున్సిపల్ శాఖ నుంచి నిధులు మాయమయ్యాయి. ఓ విదేశీ సంస్థకు వెళ్లాయి. ఆ విదేశీ సంస్థకు చెల్లించాల్సిన అవసరమే లేదు. చెల్లించేందుకు ఆర్థికశాఖ అనుమతి.. కేబినెట్ అనుమతి లేదు. పూర్తిగా ప్రజాధనం లెక్కల్లో లేకుండా పోయింది. ఇది పూర్తిగా నిధుల స్వాహా అనే అభిప్రాయం కల్పిస్తుంది. అందుకే ఏసీబీ కేసు నమోదు చేసింది. సీరియస్ నేరం కావడం పక్కాగా సాక్ష్యాలు ఉండటంతో విచారణకు పిలిచి అరెస్టులు చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# రేవంత్...అంతా తానై

హైదరాబాద్, నవంబర్ 7, పదేళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రతిదాంట్లోనూ కాంగ్రెస్‌కు అడ్డుపడుతూనే ఉంది. ఏ పథకం, ఏ అభివృద్ధి పని చేపట్టాలనుకుంటున్నా దానికి కాంగ్రెస్ వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఆ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెడుతోంది.పదేళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రతిదాంట్లోనూ కాంగ్రెస్‌కు అడ్డుపడుతూనే ఉంది. ఏ పథకం, ఏ అభివృద్ధి పని చేపట్టాలనుకుంటున్నా దానికి కాంగ్రెస్ వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఆ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెడుతోంది. ఒకవిధంగా చెప్పాలంటే బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిలా తయారైంది. అటు బీజేపీ కూడా ఏమాత్రం తగ్గకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై అటాక్ చేస్తూనే ఉంది. గ్రూప్ 1, మూసీ తదితర వివాదాలపై ఇరు పార్టీలు కూడా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఇలా ఎవరికి వారుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీపై అటాక్ చేస్తూనే ఉన్నాయి.అయితే.. రేవంత్‌కు ప్రతిపక్ష పార్టీల నుంచి ఈ విధమైన తలపోటు ఉంటే.. కొందరు సొంత పార్టీ నేతల వైఖరి కూడా ఇబ్బంది పెడుతోంది. ముఖ్యంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న లాంటి వాళ్లు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఆయన అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అయినప్పటికీ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. దాంతో ఆయనను ఆదర్శంగా తీసుకొని చాలా మంది నేతలు తమ వాయిస్ వినిపిస్తున్నారు. ప్రభుత్వంపై నిరసనగళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. వ్యతిరేక వాయిస్‌లకు బ్రేక్ వేయాలని నిర్ణయించుకున్నారు. లేదంటే భవిష్యత్తులో పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు రావచ్చన్న ఉద్దేశంతో ఆయన ఈ కీలక నిర్ణయం తీసుకోవడమే కాకుండా వారికి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.ఇటీవల కులగణనపై గాంధీభవన్‌లో సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలైన్ తప్పితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదని అన్నారు. పార్టీ మాట అంటే మాటేనని.. దానిని కాదని వేరే మాట్లాడితే పార్టీ ద్రోహులేనని అన్నట్లుగా చెప్పారు. తనకంటూ ప్రత్యేక ఎజెండా ఏమీ లేదని, పార్టీ ఎజెండానే తన ఎజెండా అని స్పష్టం చేశారు.ప్రాంతీయ పార్టీల్లో అధినేత తీసుకున్న నిర్ణయానికి పెద్దగా ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడరు. మాట్లాడలేరు కూడా. కానీ.. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించడంపై సీఎం ఒక్కసారిగా ఫైర్ అయ్యారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వచ్చినట్లుగా వారు స్టేట్మెంట్లు ఇవ్వడం అలవాటు. అంతేకాకుండా గ్రూపుల కుమ్ములాటలూ సరేసరి. ముఖ్యంగా ఇప్పుడు కొత్త, పాత అన్న వివాదం నడుస్తూనే ఉంది. దీనికితోడు ఇటీవల రాష్ట్రంలో పలు కీలక ఘటనలూ జరిగాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అనుచరుడు జగిత్యాలలో మర్డర్ అయ్యాడు. దాంతో ఆయన కూడా ఫిరాయింపుదారులపై కీలక కామెంట్స్ చేశారు. ఇటు మరో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా మొదటి నుంచి పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారన్నది స్పష్టం అవుతోంది.

# తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల రచ్చ

నిజామాబాద్, నవంబర్ 7, తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల రచ్చ నడుస్తోంది. కొంటున్నామని ప్రభుత్వం.. రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటున్నారని ప్రతిపక్షం మాటకు మాటతో డైలాగ్‌వార్‌కు దిగుతున్నాయి. వాస్తవానికి ధాన్యం కొనుగోళ్లు మాత్రం ఆలస్యం అవుతున్నాయి. ఇప్పటికే సగానికిపైగా వడ్లు ప్రైవేటుకు అమ్ముకున్నారు రైతులు. సెంటర్లు ఏర్పాటు చేశారే కానీ ఎక్కడా సరిగ్గా కొనుగోళ్లు జరగడం లేదు. దీనికి ప్రధాన కారణం మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదట. మిల్లర్లు చేతులెత్తేయడానికి ప్రభుత్వ పాలసీనే ప్రధాన కారణమంటున్నారు.ఈసారి ధాన్యం తీసుకోవడానికి మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ స్కీమ్ పెట్టింది ప్రభుత్వం. మిల్లర్లు 5 నుంచి 20 శాతం వరకు బ్యాంకు గ్యారెంటీని ఇవ్వాలని చెప్పింది. ఏదో విధంగా బ్యాంకు గ్యారెంటీ ఇద్దామనుకున్నా..మరో కండిషన్‌కు మాత్రం మిల్లర్లు ఒప్పుకోవడం లేదు. సన్నధాన్యం కూడా కేంద్రం రూపొందించినట్లు అఓఖీ అంటే కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సిందేనని రూల్ పెట్టింది. క్వింటాల్ ధాన్యానికి అఓఖీ కింద 67 కేజీల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ స్కీమ్ దొడ్డు వడ్లకు కుదురుతుంది కానీ.. సన్న వడ్లకు వర్కౌట్ కాదని మిల్లర్లు చేతులెత్తేస్తున్నారు. తెలంగాణ సర్కారు చెప్పినట్లు సన్న వడ్లు తీసుకుంటే.. క్వింటాల్‌కు 58 నుంచి 60 కేజీల బియ్యం మాత్రమే ఇస్తామంటున్నారు మిల్లర్లు.సీఎంఆర్ విషయంలో ప్రభుత్వం ససేమిరా అంటోంది. మిల్లర్లు మాత్రం సీఎంఆర్ ఇవ్వాలంటే క్వింటాల్‌కు 300 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రైస్ మిల్లింగ్ వ్యవస్థ కుప్పకూలుతుందని వాపోతున్నారు. ఈ విషయం కొలిక్కి రాక.. ధాన్యం కొనుగోళ్లు పరిస్థితి గందరగోళంగా మారింది. దీనంతటికి సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహానే కారణమనే చర్చ జరుగుతోంది. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రతీ ఏటా విడుదల చేసే విధివిధానాలను కూడా ఈసారి చాలా ఆలస్యంగా రిలీజ్ చేశారు.ప్రతీ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారంలోనే గైడ్‌లైన్స్ ప్రకటిస్తారు. కానీ ఈసారి అక్టోబర్ 28న విధివిధానాలను విడుదల చేశారు. దీనికి తోడు ఈసారి ప్రకటించిన కండీషన్స్‌తో మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఇప్పటి వరకు సన్న ధాన్యం కొనుగోలు చేయకపోవడానికి కమిషనర్ విడుదల చేసిన కండీషన్సే ప్రధాన కారణమమనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం కూడా పూర్తిగా కమిషనర్ డీఎస్ చౌహాన్ మీదనే డిపెండ్ అవుతోందని..అందుకే గ్రౌండ్ రియాలిటీని అంచనా వేయలేకపోతోందన్న టాక్ వినిపిస్తోంది.ధాన్యం కొనుగోళ్ల విషయంలో పరిస్థితి చేయి దాటిపోతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. కానీ ఇప్పటి వరకు మిల్లర్లు ప్రస్తావిస్తున్న సన్న ధాన్యం మిల్లింగ్ విషయంలో స్పష్టత రావడం లేదు. దాంతో కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు కేవలం 40వేల టన్నులకు మించి ధాన్యం సేకరించలేదు. ప్రభుత్వం మాత్రం ఈసారి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని చెబుతోంది. పరిస్థితి ఇలానే ఉంటే.. 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా సేకరించే పరిస్థితి ఉండదు. దీంతో ప్రభుత్వం చెప్పినట్లుగా రేషన్ కార్డుల మీద సన్న బియ్యం సప్లై కూడా కష్టమే అవుతుంది.

# ఆత్మహత్యాయత్నం చేసిన అఘోరి

శ్రీ కాళహస్తి ఆలయం వద్ద లేడీ అఘోరికీ.. భద్రతా సిబ్బంది మద్యన వివాదం జరిగింది. ప్రదాన శివాలయం లోకి వెళ్లాలని ఆలయం వద్దకు చేరుకున్న లేడీ అఘోరీకి ఒంటిపై బట్టలతో రావాలని భద్రతా సిబ్బందిఅడ్డుకున్నారు. కాసేపు తీవ్రంగా వాగ్వివాదం చేసిన అఘోరీ... కార్లో తెచ్చుకున్న పెట్రోల్ క్యాన్ ఓపెన్ చేసి ఆత్మహత్య యత్నం కి పాల్పడింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, స్థానికులు, లేడి కానిస్టేబుల్ లతోవంటిపై నీళ్లు పోసీ, దుస్తులు కట్టారు.

# ముందుకు సాగని రైతు కమిషన్

హైదరాబాద్, నవంబర్ 7,ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది. భూ చట్టాల నిపుణుడు సునీల్‌తో సహా మరో ఆరుగురు సభ్యులుగా ఈ కమిషన్ ముందుకెళ్తోంది. మొదటి సమావేశం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరిగింది. అయితే, కమిషన్‌కు సంబంధించి అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా, రైతు కమిషన్‌పై మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.బీఆర్‌కే భవన్‌లో కమిషన్ ఏర్పాటైంది కానీ, సరైన సౌకర్యాలు చేయలేదు సంబంధిత అధికారులు. కనీస వసతులు, కావాల్సిన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు సభ్యులు. చాంబర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు ఉన్నతాధికారులు. ప్రస్తుతం చైర్మన్ కోదండ రెడ్డి కోసం ఒక చాంబర్ ఏర్పాటు చేయగా, అందులో వాష్ రూమ్‌కు డోర్ లేని పరిస్థితి. ఎవరైనా వాష్ రూమ్‌కు వెళ్లాలంటే మరొకరు దగ్గరలో నిలబడాల్సి వస్తోంది. వచ్చిన గెస్టులు దీన్ని చూసి షాక్ అవుతున్నారు. ఈ పరిస్థితి చూసి బాధ్యతలు తీసుకోడానికి సభ్యులు వెనుకాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది.బాధ్యతలు తీసుకున్న మెంబర్లు చాంబర్ల లేక చైర్మన్ రూమ్‌లోనే కూర్చుంటున్నారు. ఈ పరిస్థితి చూసి రాములు నాయక్ తనకు పదవి వద్దని అంటున్నట్టు సమాచారం. ఓవరాల్‌గా ఈ వ్యవహారం చూశాక, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, కిందిస్థాయిలో అధికారులు నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌కు కమిషన్ ఏర్పాటు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది. అందుకే, కమిషన్ ఏర్పాటుపై జీవో ఇవ్వడానికి ఈయన మొదట్లో ఆలస్యం చేశారని అనుకుంటున్నారు.రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటోంది ప్రజా ప్రభుత్వం. ఇప్పటికే రుణమాఫీ అందించి ఎన్నో కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది. వారి అవసరాల కోసం ప్రభుత్వం రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, అధికారులు మాత్రం దీన్ని పెత్తనంగా భావిస్తున్నారు. అందుకే, పైసా కూడా వ్యవసాయ శాఖ నుండి విడుదల కావడం లేదట. దీంతో సొంత ఖర్చులతోనే టీ, స్నాక్స్ తెప్పించుకుంటున్నారు సభ్యులు.

# సినిమా



## అమరన్ కులం గురించి దర్శకుడి వివరణ



ఊహించని స్థాయిలో తమిళంతో పాటు తెలుగులోనూ సెన్సేషనల్ హిట్ గా నిలిచిన అమరన్ బాక్సాఫీస్ వద్ద స్టడీగా ఉంది. వీక్ డేస్ లో కొంత నెమ్మదించినా రెండో వీకెండ్ లో మళ్ళీ వసూళ్ల తాకిడి ఖాయమని బయ్యర్లు చెబుతున్నారు.ఇక్కడ పెద్దగా ప్రమోషన్లు చేయకపోయినా, ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ తో సరిపెట్టినా టాలీవుడ్ ప్రేక్షకులు సినిమాను ఆదరించిన తీరు అనూహ్యం. లక్కీ భాస్కర్, క లాంటి స్ట్రెయిట్ సినిమాల పోటీని తట్టుకుని ఇంత స్పందన దక్కించుకోవడం ట్రేడ్ సైతం ఊహించలేదు. సాయిపల్లవి నటన, ఎమోషన్స్, మేజర్ సాహసం ఇవన్నీ ఫ్యామిలీ ఆడియన్స్ ని కట్టి పడేస్తున్నాయి. అయితే చాలామంది మనసులో ఒక సందేహం ఉండిపోయింది. కథ ప్రకారం సాయిపల్లవి పోషించిన ఇందూ పాత్రని క్రిస్టియన్ గా స్పష్టంగా చూపించారు. ఆమె కుటుంబ బ్యాక్ గ్రౌండ్, ఆచార వ్యవహారాలు, చర్చికి వెళ్లడం లాంటివి చాలా ఉన్నాయి. కానీ మేజర్ ముకుంద్ ఏ కులమనేది చూపించలేదు. అంతగా హైలైట్ చేయకపోయినా కనీసం మాట వరసకైనా చెప్పి ఉండాల్సిందనేది కొందరు చేస్తున్న వాదన. దీని గురించి దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి క్లారిటీ ఇచ్చారు. అమరన్ కథను తెరకెక్కించాలని అనుకున్నప్పుడు మేజర్ తల్లితండ్రులు అసలు కుల ప్రస్తావనే వద్దని చెప్పారట.దేశం కోసం ప్రాణాలు అర్పించిన కొడుకు ఒక ఇండియన్, తమిళుడిగానే ప్రజలు గుర్తించాలి తప్పించి కులం ఆధారంగా కాదని చెప్పడంతో రాజ్ కుమార్ ఆ అంశాన్ని సున్నితంగా హ్యాండిల్ చేశాడు. ఇందు వైపు నుంచి అభ్యంతరం రాకపోవడంతో వాళ్ళ బ్యాక్ గ్రౌండ్ ని యధాతథంగా చూపించారు.

## సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్



'తెలుగు ఇండస్ట్రీని షేక్ చేసేలా సిల్వర్ స్క్రీన్‌పై మునుపెన్నడూ చూడని థ్రిల్లింగ్ సబ్జెక్టుతో 'వీ4వీ'. (మోటీవ్ ఫర్ మర్డర్ అనేది ట్యాగ్‌లైన్) చిత్రాన్ని తెరకెక్కించాం అని దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల అన్నారు. తెలుగుతో పాటు ఐదు భాషల్లో ఈచిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఒకే ఒక కిల్లర్ క్యారెక్టర్‌తో ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ, 'సరి కొత్త సస్పెన్స్ థ్రిల్లర్ కథతో తెరకెక్కించిన ఈ చిత్రం ఇండస్ట్రీలో ఏ ఫెదర్ ఇన్ క్రౌన్ అవ్వబోతోంది. సస్పెన్స్ థ్రిల్లర్, మర్డర్ మిస్టరీ జోనర్లో ఇదొక కలికితురాయిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది. టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు అమెరికాలోనూ ఈ సినిమా ప్రమోషన్స్ మొదలయ్యాయి. వసంత్ మ్యూజిక్, ఆనంద్ పవన్ ఎడిటింగ్, సంతోష్ షానమోని కెమెరా పనితనం.. హాలీవుడ్ రేంజ్‌లో వచ్చాయి' అని అన్నారు. మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్‌విన్ గ్రూప్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈచిత్రంలో జో శర్మ, సంబీత్ ఆచార్య ముఖ్య పాత్రధారులు.

## సమంతాకు అతి పెద్ద పరీక్ష



తెరమీద సమంతాని చూసి అభిమానులకు చాలా గ్యాప్ వచ్చేసింది. అది పెద్ద ఎత్తున తీరిపోయే రోజు రావడంతో ఫ్యాన్స్ ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. అమెజాన్ ప్రైమ్ భారీ బడ్జెట్ తో నిర్మించిన వెబ్ సిరీస్ సిటాడెల్ హనీ బన్నీ రిలీజ్ రేపు కాగా ఇవాళ అర్ధరాత్రి నుంచే స్ట్రీమింగ్ చేసుకోవచ్చు. నిన్న హైదరాబాద్ లోని ఒక ప్రముఖ మల్టీప్లెక్సులో ఇండస్ట్రీ ప్రముఖులకు ప్రీమియర్ వేశారు. స్పందన బాగానే కనిపించింది కానీ అందరూ పరిశ్రమ వ్యక్తులు కాబట్టి ఖచ్చితమైన ఫీడ్ బ్యాక్ తెలియాల్సి ఉంది. కానీ సామ్ పెర్ఫార్మన్స్ గురించి మాత్రం ప్రత్యేకంగా చెప్పిన దాఖలాలు నిన్న చాలానే ఉన్నాయి.ఇది సమంతకు ఒక రకంగా పెద్ద పరీక్ష లాంటిది. ఎందుకంటే తన ఇమేజ్ మీదే సౌత్ లో మార్కెటింగ్ చేస్తున్నారు. వరుణ్ ధావన్ హీరో అయినప్పటికీ తెలుగు, తమిళ, మలయాల, కన్నడ ప్రేక్షకులు సమంతా కోసమే హనీ బన్నీ మీద లుక్ వేస్తారు. దీని కోసం సామ్ రిస్కీ ఫైట్లు, అడ్వెంచర్లు చేసింది. ఆర్యోగం బాలేని టైంలో చేయకూడదనుకుని దర్శకుడు రాజ్ అండ్ డీకే నెరేషన్ విన్నాక వెంటనే ఒప్పేసుకుంది. స్వంత బ్యానర్ లో కొన్ని నెలల క్రితం బంగారం అనే మూవీ ప్రకటించిన సామ్ తర్వాత దాని అప్డేట్స్ ఇవ్వకపోవడమే కాదు దక్షిణాదిలో కొత్త కమిట్ మెంట్స్ సైన్ చేయలేదు. సిటాడెల్ కోసమే ఆగింది. యాక్షన్ కం మాఫియా బ్యాక్ డ్రాప్ లో రూపొందిన సిటాడెల్ హనీ బన్నీకి ది ఫ్యామిలీ మ్యాన్ సృష్టికర్తలు దర్శకత్వం వహించడంతో అంచనాలు మాములుగా లేవు. గత కొంత కాలంగా బ్లాక్ బస్టర్ కంటెంట్ లేక కొంచెం నెమ్మదించిన ప్రైమ్ కు ఇప్పుడీ సిరీస్ బ్లాక్ బస్టర్ కావడం చాలా కీలకం. ట్రైలర్, ప్రొడక్షన్ వేల్యూస్ వగైరా ఘనంగా ఉన్నాయి.

## ప్రేక్షకులకు కృతజ్ఞతలు



శివకార్తికేయన్, సాయి పల్లవి జంటగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన చిత్రం 'అమరన్'. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించారు. సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ట్ మూవీస్ బ్యానర్ ద్వారా విడుదల చేశారు. దీపావళి కానుకగా విడుదలైన ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించించి. ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న సందర్భంగా 'అమరన్' బ్రేవ్ హార్ట్ బ్లాక్‌బస్టర్ పేరుతో మేకర్స్ సక్సెస్‌మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హీరో నితిన్ మాట్లాడుతూ, 'దీపావళికి వచ్చిన మూడు సినిమాలను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. 'విక్రమ్, అమరన్' సినిమాల్లో మమ్మల్ని పార్ట్ చేసిన కమల్ హాసన్‌కి, మహేంద్రన్‌కి థ్యాంక్స్. ఒక దేశభక్తి సినిమాలో లవ్, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌ని బ్లెండ్ చేయడం అంత ఈజీ కాదు. డైరెక్టర్ రాజ్ కుమార్ చాలా అద్భుతంగా ఈ సినిమాని తీర్చిదిద్దారు. క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ రియల్లీ హార్ట్ టచింగ్' అని అన్నారు. 'మా మూవీని థియేటర్స్‌లో చాలా గొప్పగా రిసీవ్ చేసుకుంటున్నారు. చాలా మంది సినిమా చూసి ఎమోషనల్ అవుతున్నారు' అని హీరో శివ కార్తికేయన్ చెప్పారు. 'ఇలాంటి సినిమాలో నటించడం చాలా గర్వంగా ఉంది' అని నాయిక సాయిపల్లవి తెలిపారు.

### వాస్తవ ఘటనలతో 'జాతర'

సతీష్ బాబు రాటకొండ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్. గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్‌ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 8న థియేటర్స్‌లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. హీరో, దర్శకుడు సతీష్ బాబు మాట్లాడుతూ, 'వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథ రాశాను. ఊరి కట్టుబాట్లు, ఆ తంతులు, అందులో జరిగే ఘటనల గురించి చూపించాం. ఈ చిత్రానికి నిర్మాతలు బ్యాక్ బోన్‌లా నిలబడ్డారు. నటుడిగా, దర్శకుడిగా ఇది నాకు మొదటి సినిమా. మా చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. 'సతీష్ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. సినిమా కూడా బాగా తీశారు. సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత శివ శంకర్ రెడ్డి చెప్పారు. నాయిక దీయా రాజ్ మాట్లాడుతూ, 'నాకు ఇందులో మంచి పాత్ర ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని తెలిపారు.

## రానా ట్రోలింగ్.. హరీష్ శంకర్ రియాక్షన్



ఇటీవలే అబుదాబిలో నిర్వహించిన ఐఫా అవార్డుల వేడుకకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ స్టైల్‌ను అనుకరిస్తూ ఈ వేడుకకు యాంకర్లుగా వ్యవహరించిన రానా దగ్గుబాటి, తేజ సజ్జా తమ మీద తాము జోకులు వేసుకుంటూ ఇండస్ట్రీలోని కొందరు ప్రముఖుల మీద కూడా పంచులు వేశారు.ఐతే అందులో కొన్ని కౌంటర్లు ఆయా హీరోల అభిమానులకు నచ్చట్లేదు. సంక్రాంతికి మహేష్ బాబు సినిమా 'గుంటూరు కారం' మీద తేజ మూవీ 'హనుమాన్' పైచేయి సాధించిన విషయం మీద రానా, తేజ ప్రస్తావిస్తూ సెటైరికల్‌గా మాట్లాడ్డం మహేష్ ఫ్యాన్స్‌ను హర్ట్ చేసింది. నిన్నట్నుంచి వాళ్లు వీళ్లిద్దరి మీద సోషల్ మీడియాలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మహేష్ అభిమానులకు రవితేజ ఫ్యాన్స్ కూడా తోడయ్యారు. మిస్టర్ బచ్చన్ ఫెయిల్యూర్ గురించి రానా వేసిన పంచ్ మాస్ రాజా అభిమానులను బాధ పెట్టినట్లే కనిపిస్తోంది. దీని గురించి ప్రస్తావిస్తూ ఓ నెటిజన్ పోస్ట్ పెట్టాడు. మనల్ని చూసి నవ్వుకుంటున్నారు అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. మరో అభిమాని 'మిస్టర్ బచ్చన్' దర్శకుడు హరీష్ శంకర్‌ను ట్యాగ్ చేస్తూ రవితేజతో మరో సినిమా తీసి అభిమానులు కాలర్ ఎగరేసుకునేలా చేయాలని కామెంట్ చేశాడు. దీనిపై హరీష్ శంకర్ కూడా స్పందించాడు. "ఎన్నో విన్నాను తమ్ముడు. అందులో ఇదోటి. అన్ని రోజులూ ఒకలా ఉండవు. నాకైనా ఎవరికైనా" అంటూ వేదాంత ధోరణిలో రిప్లై ఇచ్చాడు హరీష్.


## చనిపోతాననుకున్నా



'క్యాన్సర్‌కు చికిత్స తీసుకున్న రోజులు నాకు ఇంకా గుర్తున్నాయి. అప్పుడు బాధ, నొప్పిని అనుభవించాను. అవే నాకు చివరి రోజులనుకున్నా. ఎలాంటి లక్షణాలు లేకుండా ఈ మహమ్మారి నాలో చివరి దశలో ఉందని తెలిసింది. మొదట అందరిలాగే భయపడ్డాను. చనిపోతాననుకున్నా. న్యూయార్క్‌లో ఉన్న గొప్ప వైద్యులు నాకు చికిత్స అందించారు. ఆరు నెలలు అక్కడే ఉన్నాను. 11 గంటలు ఆపరేషన్ చేశారు. కీమో థెరపీ గురించి నా కుటుంబానికి కూడా వైద్యులు వివరించారు. వైద్యం కొనసాగుతున్న సమయంలో అమ్మ నా కోసం ఎంతో శ్రమించింది. ధైర్యంగా ఉండు అని ఓదార్చింది. ప్రోత్సహించింది. ఆమె ఇచ్చిన ధైర్యంతోనే నేను ఆ మహమ్మారిని జయించాను' అంటూ బాలీవుడ్ హీరోయిన్ మనీషా కొయిరాలా వ్యాఖ్యానించారు. 2012లో ఆమె అండాశయ క్యాన్సర్ బారినపడ్డారు. మూడేళ్ల చికిత్స అనంతరం 2015లో ఆమె క్యాన్సర్‌ను జయించారు. 2018లో ఆమె 'హీల్డ్ హౌ క్యాన్సర్ గేవ్ మీ న్యూ లైఫ్' అనే పుస్తకాన్ని రాశారు. ప్రస్తుతం ఆమె వరుసగా వెబ్ సిరీస్‌లలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల సంజరులీలా భన్సాలీ తెరకెక్కించిన 'హీరామండి' వెబ్‌సిరీస్‌లో మల్లికాజాన్‌గా తన నటనతో ఆకట్టుకున్నారు.



# క్రీడలు



## వార్నర్ సంచలన వ్యాఖ్యలు



బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత జట్టు త్వరలో ఆస్ట్రేలియాలో పర్యటించి ఐదు టెస్టులు ఆడనుంది. అయితే, ఈ టెస్టు మ్యాచ్‌కు ముందు ఓ బంతిపై రచ్చ జరగగా, దీనిపై డేవిడ్ వార్నర్ క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి సమాధానం కోరాడు. మరో ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ ఎడ్ కోవెన్ కూడా క్రికెట్ ఆస్ట్రేలియా బహుశా బిసిసిఐని చూసి భయపడుతుందని చెప్పుకొచ్చాడు. ఇంతకీ విషయం ఏంటో ఇప్పుడు చెబుదాం? వాస్తవానికి భారత్–ఎ, ఆస్ట్రేలియా–ఎ జట్ల మధ్య జరిగిన అనధికారిక టెస్టు మ్యాచ్ చివరి రోజున బంతి గురించి హంగామా జరిగింది. ఇందులో భారత్–ఎ ఆటగాళ్లు బంతిని ట్యాంపరింగ్ చేశారని అంపైర్లు ఆరోపించారు. ఆ తర్వాత అంపైర్లు బంతిని మార్చారు. ఇప్పుడు ఆస్ట్రేలియా వార్తాపత్రిక సిడ్నీ హెరాల్డ్ టీమ్ఇండియా మారిన బంతి పరిస్థితిని వ్యతిరేకించడం లేదని, బంతిని మార్చడం గురించి కాదని పేర్కొంది. బంతిని మార్చకుండా మారిన బంతి పరిస్థితిని చూసి టీమిండియా అసంతృప్తితో ఉన్నట్లు ఆ మ్యాచ్లో వెల్లడైంది. బంతి గురించి ఆటగాళ్లు, అంపైర్లు వాగ్వాదానికి దిగడంతో ఇది పెద్ద సమస్య కాదు. ఈ సమయంలో అంపైర్ల నిర్ణయం మూర?త్వమని ఇషాన్ కిషన్ వ్యాఖ్యానించడంతో అంపైర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు ఏం జరిగిందో క్రికెట్ ఆస్ట్రేలియా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు. టీమిండియా పర్యటనకు ముందే క్రికెట్ ఆస్ట్రేలియా ఈ వ్యవహారాన్ని ముగించినట్లు కనిపిస్తోందని డేవిడ్ వార్నర్ అన్నాడు. అంపైర్లు ఏదో జరిగిందని భావిస్తే కచ్చితంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వార్నర్ తెలిపాడు. ఆ మ్యాచ్ అంపైర్లు, మ్యాచ్ రిఫరీ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వార్నర్ కోరాడు. మరోవైపు ప్రత్యర్థి జట్టు భారత్ కాకపోతే మరోలా వ్యవహరించి ఉండేదని ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ ఎడ్ కోవెన్ అన్నాడు. భారత్–ఎ జట్టుకు బదులుగా పాకిస్తాన్–ఎ, ఇంగ్లాండ్–ఎ లేదా మరే ఇతర ఎ జట్టు అయినా క్రికెట్ ఆస్ట్రేలియా ప్రతిస్పందన పూర్తిగా భిన్నంగా ఉండేదని, ఇది పూర్తిగా తప్పుడు విధానమని కోవెన్ అన్నారు.

## కోహ్లీకి బిగ్ షాకిచ్చిన ఐసీసీ

ప్రస్తుత యుగంలో అత్యుత్తమ బ్యాట్స్ మెన్ లలో విరాట్ కోహ్లీ ఒకడిగా పేరుగాంచాడు. కానీ, ఇటీవలి కాలంలో, ఈ భారత ఆటగాడు పేలవ ఫాంతో ఇబ్బందిపడుతున్నాడు.గత రెండు టెస్టుల సిరీస్ లో విరాట్ కోహ్లీ ఘోరంగా విఫలమయ్యాడు. బంగ్లాదేశ్, ఆ తర్వాత న్యూజిలాండ్ రెండింటిపై విరాట్ బ్యాట్ పెద్దగా రాణించలేదు. ఇప్పుడు ఈ వెటరన్ ఆ నష్టాన్ని అనుభవిస్తున్నాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ ప్రకటించగా, విరాట్ కోహ్లీ టాప్ 20 బ్యాట్స్ మెన్స్ జాబితా నుంచి వైదొలిగాడు. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత విరాట్ కోహ్లీ తన కెరీర్లో ఇలాంటి చెడ్డ రోజులను చూశాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్లో విరాట్ కోహ్లీ 22వ స్థానానికి పడిపోయాడు. 2014లో ఇంగ్లాండ్ పర్యటనలో పేలవ ప్రదర్శన చేసిన తర్వాత విరాట్ కోహ్లీకి అలాంటి పరిస్థితే ఎదురైంది. అయితే, పెద్ద విషయం ఏమిటంటే, ఆ తర్వాత విరాట్ కోహ్లీ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ఈ భారత ఆటగాడు ఆస్ట్రేలియా పర్యటనలో ఇలాంటిదే చేయగలరని భావిస్తున్నారు. అయితే, విరాట్ కోహ్లీ చాలా పేలవమైన ఫామ్లో ఉన్నందున ఇది అంత సులభం కాదు. ఈ ఏడాది 6 టెస్టులు ఆడిన విరాట్ కోహ్లీ 22.72 సగటుతో 250 పరుగులు మాత్రమే చేయగలిగాడు.

## 19న నాదల్ వీడ్కోలు మ్యాచ్



మాడ్రిడ్: టెన్నిస్ మాజీ వరల్డ్ నంబర్ వన్ ఆటగాడు, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ వీడ్కోలు మ్యాచ్‌కు తేదీ ఖరారైంది. ఈ ఏడాది జరిగే డేవిస్ కప్ ఫైనల్స్‌తో నాదల్ తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించనున్నాడు. ఈ విషయాన్ని టోర్నమెంట్ డైరెక్టర్ ఫెలిసియానో లోపెజ్ బుధవారం వెల్లడించాడు. స్వదేశంలో జరుగబోయే డేవిస్ కప్ ఫైనల్స్ 8వ సీజన్ నాదల్‌కు ప్రొఫెషనల్ ప్లేయర్‌గా ఆఖరి మ్యాచ్. అక్కడి మలగాలో నవంబర్ 19న ఈ టోర్నీ మొదలు కానుంది. ఆరు రోజుల పాటు సాగే డేవిస్ కప్ ఫైనల్స్‌లో రఫా చివరిసారిగా దేశం తరఫున బరిలోకి దిగుతున్నాడు. దాంతో, అతడి విజయం సాధించాలని అభిమానులంతా కోరుకుంటున్నారు. టెన్నిస్ యోధుడైన నాదల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి అతడికి ఘన వీడ్కోలు పలకాలని ఫెదరర్, జకోవిచ్, ముర్రేలతో పాటు పలువురు టెన్నిస్ స్టార్లు హాజరుకానున్నారని వెల్లడించాడు. నాదల్ అక్టోబర్‌లోనే టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పాడు. చివరి టోర్నీగా డేవిస్ కప్ ఫైనల్స్ ఆడుతానని అప్పుడే తెలిపాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు.


## ఇలాగైతే టీమ్‌లో ప్లేస్ కష్టమే..
## ఆసీస్- ఎతో టెస్ట్ మ్యాచ్‌లోనూ..



ఇటీవల వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్నాడు టీమిండియా స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్. దీంతో అతనికి మరింత ప్రాక్టీస్ కోసం ఇండియా ఏ జట్టు తరఫున ఆడాలని బీసీసీఐ ఆదేశించింది. ఈ క్రమంలోనేమెల్‌బోర్న్‌లో ఇండియా ఎ, ఆస్ట్రేలియా ఎ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కెఎల్ రాహుల్ బరిలోకి దిగాడు. కానీ కేవలం 4 పరుగులు మాత్రమే చేసి వికెట్ సమర్పిచుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఎ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. భారత్ ఎ తరఫున ఇన్నింగ్స్ ప్రారంభించిన కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ క్రీజులో నిలబడలేకపోయారు. అభిమన్యు ఈశ్వరన్ (0) డకౌట్ కాగా, కేఎల్ రాహుల్ 4 బంతుల్లో 1 ఫోర్ కొట్టి స్కాట్ బోలాండ్ కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. మూడో స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్ (0) కూడా నిరాశపర్చాడు. అలాగే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ఈ దశలో బరిలోకి దిగిన దేవదత్ పడిక్కల్ 55 బంతులు ఎదుర్కొని 26 పరుగులు చేశాడు. కానీ మైఖేల్ నేసర్ వేసిన బంతిని మార్క్ చేయడంలో విఫలమవడంతో పడిక్కల్ కూడా వికెట్ కోల్పోయాడు. దీంతో 26 ఓవర్లు ముగిసే సరికి భారత్ ఎ జట్టు 5 వికెట్లు కోల్పోయి 65 పరుగులు మాత్రమే చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో విఫలమైన కేఎల్ రాహుల్, మిగిలిన రెండు మ్యాచ్‌లకు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకోలేదు. అయితే ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్‌కు రాహుల్ ఎంపికయ్యాడు. కానీ ఈ సిరీస్ ప్రారంభానికి ముందు, ఆస్ట్రేలియాలో జరుగుతున్న సిరీస్‌లో భారత్ ఎ జట్టుకు ఆడాలని రాహుల్‌కు బీసీసీఐ సూచించింది. దీని ప్రకారం, ఆస్ట్రేలియా–ాతో జరిగిన మ్యాచ్‌లో, ఖా రాహుల్ మొదటి ఇన్నింగ్స్‌లో విఫలమయ్యాడు. ఇదే పేలవమైన ఫామ్‌ను కొనసాగిస్తే, ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు కూడా అతను రిజర్వ్ బెంచ్ కే పరిమితం కాక తప్పదు.

## హెూరాహెూరీ పోరులో టైటాన్స్‌దే పైచేయి..
## తలైవాస్‌పై ఉత్కంఠ విజయం

ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో మరోపోరు అభిమానులను కట్టిపడేసింది. గచ్చిబౌలి స్టేడియం వేదికగా బుధవారం హెూరాహెూరీగా సాగిన పోరులో తెలుగు టైటాన్స్ 35–34 తేడాతో తమిళ్ తలైవాస్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. పీకేఎల్–8వ సీజన్ తర్వాత తలైవాస్‌పై టైటాన్స్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. టైటాన్స్ తరఫున స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో అదరగొట్టగా, అశిష్ నార్వల్(9), విజయ్ మాలిక్(4) ఆకట్టుకున్నారు. మరోవైపు తలైవాస్ జట్టులో సచిన్ 17 పాయింట్లతో టాప్‌స్కోరర్‌గా నిలిచినా జట్టును గెలిపించలేకపోయాడు. సచిన్‌కు తోడు నితీశ్‌కుమార్(4), నరేందర్(3) ఫర్వాలేదనిపించారు. పీకేఎల్‌లో 1000 పాయింట్ల క్లబ్‌లో సచిన్ తాజాగా చేరాడు. వరుసగా హ్యాట్రిక్ విజయంతో టైటాన్స్ 21 పాయింట్లతో 4వ స్థానంలోకి దూసుకురాగా, తలైవాస్ 21 పాయింట్లతో మూడులో ఉంది. లీగ్ సాగుతున్న కొద్దీ జట్ల మధ్య పోరు నువ్వానేన్నా అన్నట్లు హెూరాహెూరీగా సాగుతున్నది. గత సీజన్‌లో అభిమానులను తీవ్రంగా నిరాశపరిచిన తెలుగు టైటాన్స్ ఈసారి అంచనాలకు అనుగుణంగా ముందుకెళుతున్నది. స్థానిక అభిమానుల మద్దతుతో ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. లీగ్‌లో ప్లేఆఫ్స్‌కు సాధించాలంటే ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో అన్ని జట్లు తుదికంటా పోరాడుతున్నాయి. ప్రతీ పాయింట్‌ను కీలకంగా భావిస్తూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇప్పుడు ఇదే కోవలో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య పోరులో తొలి అర్ధభాగం ఉత్కంఠగా సాగింది. తొలి 20 నిమిషాల ఆట ముగిసే సరికి టైటాన్స్ 20–17 తేడాతో తలైవాస్‌పై ఆధిక్యం ప్రదర్శించింది. స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ తనదైన జోరు కనబరుస్తూ టైటాన్స్ కీలక పాయింట్లు అందించాడు. తొలి రెండు రైడ్లలో అంతగా ఆకట్టుకోలేకపోయిన పవన్ ఆ తర్వాత జూలు విదిల్చాడు. మ్యాచ్ 18వ నిమిషంలో విజయ్ మాలిక్ రైడ్‌తో టైటాన్స్ పాయింట్ల వేట ప్రారంభించింది. మరో ఎండ్‌లో పవన్ కూడా జతకలువడంతో టైటాన్స్ టాప్‌గేర్‌లోకి దూసుకొచ్చింది. మ్యాచ్ 12వ నిమిషంలో హిమాంశు, రోనక్ ఇద్దరిని పవన్ ఔట్ చేయడం ద్వారా తలైవాస్ తొలిసార ఆలౌటై టైటాన్స్‌కు నాలుగు పాయింట్లు సమర్పించుకుంది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన సచిన్ 11వ నిమిషంలో కిషన్, అశిష్‌ను ఔట్ చేసి తలైవాస్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. ఇక్కణ్నుంచి పోటీ మరింత రంజుగా మారింది. 6వ నిమిషంలో డూ ఆర్ డై రైడ్‌కు వచ్చిన టైటాన్స్ రైడర్ అశిష్ నార్వల్..అభిషేక్‌ను ఔట్ చేసి పాయింట్ కొల్లగొట్టాడు. తొలి అర్ధభాగం మరో 4 నిమిషాల్లో ముగుస్తుందనగా రైడ్‌కు వెళ్లిన పవన్‌ను..నితీశ్‌కుమార్ సూపర్ ట్యాకిల్‌తో కట్టడి చేశాడు.



## ఐపిఎల్ వేలం బరిలో 1,574మంది ఆటగాళ్లు




ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) మెగా వేలానికి రంగం సిద్ధమైంది. ఈసారి మొత్తం 1574మంది ఆటగాళ్లు వేలం బరిలో నిలిచారు. తొలిసారి మెగా వేలాన్ని సౌదీ అరేబియాలోని జెడ్డాలో నిర్వహించనున్నారు. సోమవారంతో ఆటగాళ్ల నమోదు అధికారికంగా ముగియగా.. మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో 1,165 మంది భారతీయులు, 409 మంది విదేశీయులు ఉన్నారు. గత సీజన్ వరకు కెప్టెన్‌లుగా ఉన్న రిషభ్ పంత్(ఢిల్లీ), కేఎల్ రాహుల్ (లక్నో), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా)లను ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకోలేదు. ఈ ముగ్గురు స్టార్ ఆటగాళ్లు తమ కనీస ధర రూ.2 కోట్లుగా నిర్ణయించుకున్నారు. రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమి, ఇషాన్ కిషన్, దీపక్ చాహర్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్, భువనేశ్వర్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ, నటరాజన్, పడిక్కల్, కృనాల్ పాండ్య, హర్షల్ పటేల్, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, ఖలీల్ అహ్మద్, ఉమేశ్ యాదవ్ కూడా రూ.2 కోట్ల కనీస ధరతో వేలంలో పేరు నమోదు చేసుకున్నారు. యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా బేస్ ధర రూ.75 లక్షలుగా నిర్ణయించుకున్నారు. గత సీజన్‌లో రూ.24.50 కోట్ల ధర పలికిన మిచెల్ స్టార్క్ రూ.2 కోట్ల బేస్ ధరతో వేలంలో ఉన్నాడు.

# సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు

## క్వింటాల్ కు 7,521/- రూపాయల మద్దతు ధర

## కొనుగోలు కేంద్రాలను స్వాదినియోగం చేసుకోవాలి

## ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ నవంబర్ 07 :** మంచిర్యాల జిల్లాలోని తాండూర్ మండలం రేపల్లెవాడ లోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా నిర్వహించే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామి ప్రారంభించారు.

అనంతరం ఇద్దరు యువ పత్తి రైతులు ప్రసాద్,రాము లను ఎమ్మెల్యే వినోద్ శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ... రైతులు కొనుగోలు కేంద్రానికి తేమ తక్కువగా ఉండి,చెత్తా చెదారం లేని నాణ్యత గల పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దని తెలిపారు.పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు అలాగే ఏ కాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు .

అటు వద్దు ఇటు పత్తి కొనుగోల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తమను నేరుగా సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దిన్,సంబంధిత అధికారులు,జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేలో దేశానికే ఐకాన్ గా తెలంగాణ

## – వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్ 7:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే దేశానికే ఐకాన్ గా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గురువారం కాజీపేట చౌరస్తా కూడలి వద్ద సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే పై ఎన్యుమరేటర్ల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సర్వే చేపడుతుండగా ప్రజలందరూ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. సర్వే తో భవిష్యత్తులో ప్రజలకు ఎన్నో లాభాలు కలుగుతాయన్నారు. రాజకీయంగా ఆర్థికంగా ఇలా ఎన్నో విధాలుగా ఈ సర్వే దోహదపడుతుందన్నారు. మూడు రోజులపాటు ప్రతి ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు స్టిక్కర్లను వేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఎక్కడ కూడా విస్మరించకుండా సమగ్ర వివరాల కోసం ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వస్తారన్నారు. ఏ కుటుంబమైన ఎక్కడికైనా వెళ్లిన కూడా తిరిగి వచ్చి సర్వే వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. సర్వే పైన ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. వారం రోజులుగా సర్వేపై విస్తృత ప్రచారాన్ని అధికార యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే ను రాష్ట్రంలో నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తో దేశంలోనే రాష్ట్రం ఐకాన్ గా ఉండాలని ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టారని అన్నారు. ఈ సర్వే గురించి తన చుట్టుపక్కల వారికి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం లో చేపట్టిన ఈ సర్వే దేశానికి దిక్సూచిగా మారబోతుందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా సర్వే నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం సర్వేలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో సగం గ్రామీణ ప్రాంతం తో పాటు మరో సగ భాగం పట్టణ ప్రాంతంగా మిళితమై ఉందని పేర్కొన్నారు. సర్వే చేపట్టేందుకు జిడబ్ల్యుఎంసి పరిధిలో 800 వరకు ఎన్యూమరేషన్ బ్లాకులు గా గుర్తించామని అన్నారు. ఎన్యుమరేషన్ బ్లాకు ల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల తో పాటు ఆర్పీలు,అంగన్వాడీ టీచర్లను ఎన్యుమరేటర్లుగా నియమించడం జరిగిందన్నారు. ఎన్యుమరేటర్లు సర్వే చేస్తుండగా పర్యవేక్షించేందుకు సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. సర్వే అనేది రెండు భాగాలుగా జరుగుతుందన్నారు. మొదటి దశలో మూడు రోజులపాటు ప్రతి ఇంటికి స్టిక్కర్ ను అతికించడం జరుగుతుందన్నారు. ఇంటింటికి స్టిక్కర్లు అతికించిన అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబం యొక్క సమగ్ర వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారని చెప్పారు. ఎన్యుమరేషన్ బ్లాక్ లోని ప్రతి ఇంటికి స్టిక్కర్ను తప్పనిసరిగా అంటిస్తారని,వచ్చేవారం సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్ కు సరైన వివరాలను ఆయా కుటుంబాల వారు తెలియజేయాలన్నారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్,పాస్ బుక్ లు ఉన్నట్లయితే సర్వే కు సంబంధించిన సమాచారాన్ని ఎన్యుమరేటర్ కు ఇవ్వడానికి సులువుగా ఉంటుందన్నారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సర్వేలో సరైన వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో సామాజిక ఆర్థిక సర్వే కు ప్రజలు సహకరించాలన్నారు. కాజీపేట వాటర్ ట్యాంక్ సమీపంలో సామాజిక ఆర్థిక సర్వే స్టిక్కర్లను ఎన్యూమరేటర్లు ఇంటింటికి అతికిస్తుండగా ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్,విజయశ్రీ రజాలి, కాజీపేట తహసిల్దార్ బావ్ సింగ్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్,ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# 14 నెలలుగా వేతనాలు చెల్లించని ఐటిడిఏ ఇంజనీరింగ్ అధికారులు

## న్యాయం చేయాలని ఉన్నత అధికారులకు ఎలక్ట్రిషియన్ వేడుకలు




**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ నవంబర్ 07 :** ఐటిడిఏ దండేపల్లి డివిజన్ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యుత్ మరమ్మతులతో పాటుగా విద్యుత్ తదితర సేవలు ఎలక్ట్రిషియన్ గా విధులు నిర్వహించినప్పటికి ప్రభుత్వం నుంచి నాకు వేతనాలు రావడం లేదని మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం. లింగేశ్వర్ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మంచిర్యాల జిల్లా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గా ఆర్.వి కర్ణన్ విధులు నిర్వర్తించినప్పుడు మొదటగా మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి ఐటిడిఏ డివిజన్ లో ఎలక్ట్రిసియన్ గా నన్ను నియమించడం జరిగినదని నేను చాలా కాలం విధులు నిర్వర్తించిన్నప్పటి వేతనాలు రాలేక కొంతకాలం పని మానివేయడం జరిగిందని అనంతరం దండేపల్లి డివిజన్ లో ఎలక్ట్రిషియన్ స్థానం ఖాళీ ఉందని తెలియడం తో ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కి ఎలక్ట్రిషియన్ గా విధుల్లో కి తీసుకోమని దరఖాస్తు చేసుకోగా ప్రాజెక్టు అధికారి మళ్ళీ దండేపల్లి డివిజన్ లో ఎలక్ట్రిషియన్ గా విధులు నిర్వర్తించమని గత సంవత్సరం జులై నెలలో ఆదేశాలు జారీ చేయగా నేను దండేపల్లి డివిజన్ లో ఎలక్ట్రిషియన్ గా విధుల్లో చేరి 14 నెలలుగా నాకు ఈ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించిన విధులు సక్రమంగా నిర్వర్తించినప్పటికి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వేతనాలు సక్రమంగా రాకపోవడం మూలంగా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నానని ఈ విషయం పై సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు నిజ నిజాలు పరిశీలిస్తూ చొరవ తీసుకుని దీనిపై విచారణ జరిపించి నాకు సకాలంలో వేతనాలు వచ్చేలా చేయగలరని కోరారు.జీతం ఇవ్వాలని డి ఈ ఈ ని సంప్రదించగా అసభ్య పదజాలంతో దూషించటం జరిగింది అని వాపోయారు.దళితుడనని చులకనభావంతో మాట్లాడినటువంటి డి ఈ ఈ పైన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక




జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 7 ఈ నెల 5 తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగరు లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్స్ లో అత్యంత ప్రతిభ కనబరిచి జడ్పీహెచ్ఎస్ కోరపల్లి ఉన్నత పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు వైష్ణవి,లౌక్యశ్రీ లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిడి జి.శ్రీను తెలిపారు. వీరు 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరుదొడ్డి సమ్మయ్య అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బండారి రజిత, పోల్సని సంపత్ రావు,పి ఎం కె సంస్థ ప్రభాకర్ రావు,వి వి ఎస్ నారాయణ, వెంకటేశ్వర్ల రెడ్డి గ్రామస్తులు మరియు ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు పలువురు అభినందించారు

# దళితుల పట్ల వివక్షత చూపిస్తున్న బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు

## ధర్మ సమాజ్ పార్టీ నాయకులు చిలువేరు శ్రీకాంత్



**జమ్మికుంట ప్రజబలం ప్రతినిది నవంబర్ 7** దళిత బంధు రెండో విడత నిధుల జాప్యంపై టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఖరి పై గురువారం రోజున జమ్మికుంట ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ, నాయకులు తీవ్రంగా మండిపడ్డారు,గత బిఆర్ఎస్ ప్రభుత్వం హుజరాబాద్ నియోజకవర్గం లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన దళిత బంధు కార్యక్రమం హుజురాబాద్ నియోజకవర్గం లో దళితులకు రెండో విడత ఇవ్వకుండా మధ్యలోనే అసంపూర్తిగా ఉంచడంపై ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి %ం% ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి చిలువేరు.శ్రీకాంత్ మహరాజ్, మాట్లాడుతూ నియోజకవర్గంలో దళిత బంధు రెండో విడత నిధుల జాప్యం పై బిఆర్ఎస్ ,కాంగ్రెస్ పార్టీలపై తీవ్రంగా మండిపడ్డారు.ఎన్నికల సమయంలో బి ఆర్ ఎస్ పార్టీ తన స్వార్థ రాజకీయాల కోసం దళిత బంధు రెండో విడత నిధులను ఆపింది పాడి కౌశిక్ రెడ్డి పనే అని విమర్శించారు. మళ్ళీ తనే హుజురాబాద్ నియోజకవర్గం లో ఉన్న దళిత కుటుంబాలకు అండగా ఉంటానని, దళితుల కోసం తలనైన నరుకుంటా అని మాట్లాడడం సిగ్గుచేటని, నిజంగా నీకు దళితులపై చిత్తశుద్ధి ఉంటే మీరు రాజీనామా చేసి 50 వేల దళిత ఓట్లు ఉన్నటువంటి ఈ నియోజకవర్గంలో మీ పార్టీ నుండి దళితున్ని ఎమ్మెల్యే చేసే దమ్ముందా, అని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ మీ పార్టీ అధికారంలో ఉంది కదా మరి మీరు క్లోజ్ చేసినా అకౌంట్లోను ఓపెన్ చేసి నేరుగా మీరే చెక్కు రూపంలో ప్రతి ఒక్కరికీ ఇవ్వచ్చు కదా, కానీ మీరు ఆ పని ఎందుకు చేయడం లేదు అంటే మీరు కూడా దళితుల పట్ల వివక్షతనే చూపిస్తున్నారని అన్నారు,దళిత బంధు రెండో విడత నిధులు వారంలోగా మంజూరు చేయని యెడల ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గం లో రిలే నిరాహార దీక్షల తో పాటు ఆమరణ నిరహార దీక్ష చేయడానికైనా సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాకేష్,సదానందం మండల నాయకులు రవితేజ, సందీప్,ప్రేమ్ సాగర్,అభిలాష్, శివాజీ,ప్రశాంత్,రక్షిత్,కుమార్, రాకేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఓటింగ్ శాతం పెంచడంలో కృషిచేసిన మీడియా ప్రతినిధులకు అవార్డులు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 07 :** 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని పెంపొందించడంలో మీడియా నిర్వహించిన పాత్ర గుర్తించి అవార్డులు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2004 సంవత్సరం ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిన ప్రింట్ మీడియా,ఎలక్ట్రానిక్ టెలివిజన్ మీడియా, ఎలక్ట్రానిక్ రేడియో మీడియా,ఆన్లైన్ (ఇంటర్నెట్) సోషల్ మీడియా ప్రతినిధుల కు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవార్డు ప్రధాన ఉత్సవం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలోని సంస్థలు, ప్రతినిధులు తాము చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, శిబిరాల పూర్తి వివరాలతో నామినేషన్లు సమర్పించాలని, ఈనెల 25వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని తెలిపారు.

# పలు హోటళ్లలో తనిఖీలు..నోటీసుల జారీ

హైదరాబాద్ గ్రేటర్ హైదరాబాద్ లోని హోటల్స్, రెస్టారెంట్స్ పై జీహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారుల నాన్ స్టాప్ దాడులు నిర్వహించారు. మూసాపేట్ కృతుంగ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు చేసారు. కిచెన్ లో ఎలుకలు, బొద్దింకలు ఉన్నట్లు గుర్తించారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని నిర్ధారించారు. కుళ్లిన చికెన్ ను కృతుంగ హోటల్ నిర్వాహకులు. రోజుల తరబడి ఫ్రిజ్ లో నిల్వ ఉంచారు.ష మరోవైపు, ఓల్డ్ సిటీ సంతోష్ నగర్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర, ఉడిపి, సంతోష్ డాబా రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ దాడులు జరిపారు. హోటల్స్ కిచెన్ లో బొద్దింకలు గుర్తించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తున్నారు.

# సీఎం చంద్రబాబు పై అనుచిత పోస్టులు నిందితుడికి రిమాండ్

సోషల్ మీడియాలో సిఎం చంద్ర బాబు ,ఉండి ఎమ్మెల్యే పై అనుచిత పోస్టుల పై పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసామని గుంటూరు వెస్ట్ డిఎస్పీ జయరాం ప్రసాద్ వెల్లడించారు. అనుచిత పోస్టుల పెట్టిన వెంకట్రామి రెడ్డి నీ అరెస్టు చేశాం . నిందితుడు పై గతంలో నాలుగు కేసులు ఉన్నాయి. నిందితుడు వైసిపి సోషల్ మీడియా విధులు నిర్వర్తిస్తున్నారు. నిందితుడు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారు. నిందితుడు కికోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని అన్నారు

# సాఫీగా భద్రకాళి చెరువు నీరు విడుదల

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్7:భద్రకాళి చెరువు నీటిని సాఫీగా విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.భద్రకాళి చెరువు పూడికతీత పనులకు ముందస్తు చర్యలలో భాగంగా శుక్రవారం నుండి చెరువు నీటి విడుదల నేపథ్యంలో గురువారం హనుమకొండ కాపువాడ సమీపంలో ఉన్న భద్రకాళి చెరువు మత్తడితో పాటు కాపువాడ వద్ద ఉన్న నీటి కాలువ,ఎస్టిపి కోసం రెడ్డి పురం జంక్షన్ ప్రాంతంలో గతంలో సాగునీటిపారుదల శాఖ కెనాల్ కోసం మట్టి తీసిన ప్రాంతాన్ని, హసన్ పర్తి మండలం నాగారం గ్రామంలోని పెద్ద చెరువును హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే,అధికారులతో కలిసి పరిశీలించారు.భద్రకాళి చెరువు నీరు విడుదలకు సంబంధించిన పలు అంశాలపై సాగునీటి పారుదల శాఖ,మున్సిపల్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మీడియాతో మాట్లాడుతూ నగరంలోని భద్రకాళి చెరువు పూడికతో నిండిపోయిందని,దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతూ వస్తుందని ఇదే విషయం హైదరాబాద్ లో రాష్ట్ర మంత్రులు పాల్గొన్న సమావేశంలో వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.దీంతో భద్రకాళి చెరువు పూడికతీత పనులు,చెరువు చుట్టూ ఇతర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఆదేశాలు అందినట్లు తెలిపారు. భద్రకాళి చెరువులో పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని మత్తడి ద్వారా ప్రతిరోజు విడుదల చేయనున్నట్లు తెలిపారు.భద్రకాళి చెరువు నీరు నగరంలోని కాల్వ ద్వారా హసన్ పర్తి మండలం నాగారంలోని పెద్ద చెరువుకు చేరుతుందన్నారు. ఒకవేళ నాగారం చెరువు భద్రకాళి చెరువు నుండి వచ్చే నీటితో నిండినట్లయితే ఇప్పటివరకు ఏ విధంగానైతే మత్తడి నుండి కింది ప్రాంతానికి వాగు ద్వారా ఏ విధంగా అయితే వెళ్తుందో అలాగే వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజలకు,రైతులకు, పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.నీటి ప్రవాహం సాఫీగా ఉండేటట్టు సాగునీటిపారుదల శాఖ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపడతారన్నారు.కల్వర్టుల వద్ద, కాల్వలలో చెత్త చెదారం,ఇతర ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.భద్రకాళి చెరువు నీటిని పెద్ద మొత్తంలో కాకుండా తక్కువ పరిమాణంలో శుక్రవారం నుండి విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.కాలువల పక్కన ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 10-15 రోజుల్లో భద్రకాళి చెరువులోని నీటిని పూర్తిస్థాయిలో తీసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.భద్రకాళి చెరువులోని నీటిని తీసే ప్రక్రియను జాగ్రత్తగా చేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.భద్రకాళి చెరువులో పూడిక తీయడం వలన నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందని,చెరువు నీరు బాగుండనుందని పేర్కొన్నారు. భద్రకాళి చెరువు పూడికతీయడం వలన రానున్న రోజుల్లో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. చెరువు నీటిని తీసేసిన అనంతరం పూడికతీత పనులు జరుగుతాయని అన్నారు.భారీ వరదల కారణంగా మురుగునీరు కొంతమేరకు వస్తుందని,మిగతా సమయాల్లో మురుగునీరు అందులో చేరదన్నారు. చెరువు పూడికతీత అనంతరం రానున్న రోజుల్లో బొంది వాగు ప్రాంతం నుండి మురుగునీరు చేరకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మురుగునీటి విషయంలో ఎస్టిపి ప్లాన్ కోసం మంత్రులు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సాగునీటి పారుదల శాఖ ఈఈ సీతారాం,మున్సిపల్ డిఈ సంతోష్ బాబు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విదేశాలలో పనిచేయుటకు దరఖాస్తు చేసుకోవాలి

## జిల్లా ఉపాధి కల్పనా అధికారి

ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 07 : విదేశాలలో పనిచేయుటకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఒక రిజిస్టర్ ఏజెన్సీ నుండి అర్హత, నైపుణ్యం కలిగిన సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాలలో ఉపాధి కల్పించడం జరుగుతుందని, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.టామ్ కామ్ వివిధ దేశాలలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఏజెన్సీ లతో భాగస్వామ్యం కుదుర్చుకుందని, ప్రస్తుతం జర్మనీలో అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు.యుటిలిటీ వాహనాలు, కమర్షియల్ వాహనాల కోసం ఆటోమోటివ్ టెక్నీషియన్ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న, ప్రముఖ ఆటోమోటివ్ వాహన బ్రాండ్లతో 3 నుండి 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని,వాహన మెకట్రానిక్స్ లో బ్యాచిలర్ డిగ్రీ / సంబంధిత రంగంలో కనీసం 3 సంవత్సరాల అనుభవంతో డిప్లొమా కలిగి ఉండాలని,20-40 వయసు ఉండాలని తెలిపారు.అభ్యర్థులకు జర్మన్ భాష శిక్షణను ఎ1, ఎ2,బి1,బి2 స్థాయిలకు అనుగుణంగా సౌకర్యం కల్పిస్తుందని, అభ్యర్థులు వివరాలకు www.tomcom.telangana.gov.in లో సంప్రదించవచ్చని తెలిపారు.

# కులగణన సర్వేను జయప్రదం చేయండి

### అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ చిలకల వెంకట నరసయ్య చిత్తారు సింహాద్రి యాదవ్




ఖమ్మం ప్రతినిధి నవంబర్ 7 (ప్రజాబలం) ఖమ్మం ఈనెల ఆరవ తారీకు నుండితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా బీసీలుయొక్క స్థితిగతులు జనాభా వివరాలు పూర్తిగా తెలియడం ద్వారా రాజ్యాంగం నుండి సంక్రమించే హక్కులు అధిక జనాభా గలిగిన బీసీలకు వచ్చే అవకాశం ఉందని, కావున అధికారులకు సహకరించవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పిలుపునిచ్చారు అఖిలభారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం 2014 ఆగస్టులో చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే ద్వారా బీసీల శాతం 61% ఉన్నదని తేలింది. కానీ దాన్ని గత ప్రభుత్వం ఆ సర్వే ని బయటపెట్టకుండా బీసీలకు రావాల్సిన హక్కులను రాకుండా అణగదొక్కడం జరిగిందని,బీసీల జనాభా ఎక్కువ ఉన్నదని తెలిస్తే హక్కుల కోసం పోరాటం చేస్తారని, వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయడం జరిగింది అని, ఆ విధంగా కాకుండా ఈసారి చేపట్టి కార్యక్రమం నిష్పక్షపాతంగా, ఉండాలని, సర్వే వివరాలను వెంటనే అధికారికంగా ప్రభుత్వం ప్రకటించాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్వే ఆధారంగా బీసీలకు రాజ్యాంగ అధికారం కలిగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా యాదవులు సర్వే ఫారం కులం(7)లో యాదవ్ అని వ్రాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్ ఎస్ టి ( సంచార జాతులు) సర్టిఫికెట్ను యాదవులకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకులు పొదిల సతీష్ సత్తి వెంకన్న యాదవ్ వాగదాని కోటేశ్వరరావు పొదిలి భూపతి కంకు వెంకటేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

# భారత్-భుటాన్ ల మధ్య ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టు ప్రారంభం

గువహటీ భారత్ భూటాన్ మధ్య గురువారం నాడు చారిత్రక పరిణామం చోటు చేసుకుంది. అసోంలోని దర్రంగా వద్దనున్న భూటాన్ సరిహద్దులో 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్' ప్రారంభం అయింది. 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్'ను కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ముందుగా బండి సంజయ్ కు అసోం డీజీపీ, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. భుటాన్ ప్రధాని శెరింగ్ టోబ్గే, అసోం గవర్నర్ ఆచార్య లక్ష్మణ్ ప్రసాద్ తో కలిసి చెక్ పోస్టును కేంద్ర మంత్రి డి సంజయ్ ప్రారంభించారు. దీంతో ఇరు దేశాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయి. చెక్ పోస్టు ఏర్పాటుతో భారత్ కు లాజిస్టిక్ ఖర్చులభారం తగ్గుతుంది. ఇరుదేశాల మధ్య ప్రజా సంబంధాలు కుడా పెరుగుతాయి. వ్యాపార, వాణిజ్య, సేవా కార్యకలాపాలు సులభతరం అవుతాయి.

# నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్టింగ్

## -మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి



ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 7 :రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాలతో మంచిర్యాల డిసిపి పర్యవేక్షణలో గురువారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ని ఎర్రగుంటపల్లి లో తెల్లవారుజామున మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్సైలు మరియు సిబ్బంది తో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి గ్రామంలో తనిఖీలు నిర్వహించి తగిన ధ్రువ పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలను 1 ఆటో సీజ్ చేయటం జరిగింది.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని , కాలనీ లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్ లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు ఉండే అనుమానాస్పద ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్ తో పరిశీలించారు.కాలనీ లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్, వాట్సాప్ కాల్స్ లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.



వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి అన్నారు. కాలనీ లో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ. కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన లేదా రవాణా చేసిన మాకు సమాచారము ఇవ్వాలని , అట్టివారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, కాశీపేట ఎస్సై ప్రవీణ్, దేవపుర్ ఎస్సై ఆంజనేయులు, ఆర్ఎస్ఐ శివ మందమర్రి అదనపు ఎస్సై శ్రీనివాస్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచండి

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





ప్రజా బలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్ 7:పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం శాయంపేట పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ రోజు ఉదయం శాయంపేట పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు పోలీస్ అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసుల గౌరవ వందనం చేశారు. ముందుగా పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరుచేసిన కిట్ ఆర్టికల్స్ ను పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగి కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ సబ్ ఇన్స్ స్పెక్టరు ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీంచారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలి. ఫిర్యాదు వచ్చి వెంటనే స్పందించాలని, ప్రజలకు పోలీసులపై వున్న నమ్మకానికి తగ్గాటుగానే పోలీసులు. నీజాయితీ తో పనిచేయాలని,పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ట లకు భంగం కలిగించే విధంగా వ్యవహారిస్తే చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ తెలిపారు.చివరగా పోలీస్ కమిషనర్ చేతులమీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కను నాటారు.ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్,పరకాల ఏసీపీ కిశోర్, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ రంజిత్ రావు, ఎస్సై. ప్రమోద్ కుమార్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ రైల్వే స్టేషన్ లో తనిఖీలు చేసిన యాంటీ డ్రగ్స్ టీం



ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా నవంబర్ 7:వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్స్ టీం, ఇంతేజార్ గంజ్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ లో పోలీస్ జాగిలంతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు అనుమానస్పదంగా ప్రయాణికుల సామానుతో పాటు, బ్యాగ్ లను పోలీసులు పోలీస్ జాగిలంటో తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ టీం ఇంచార్జి ఇన్స్ స్పెక్టర్ సురేష్ ప్రయాణికులతో మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు రహస్యం గంజాయి లాంటి మత్తు పదార్థాలను అక్రమ చేస్తున్న, విక్రయిస్తున్న, వినియోగిస్తున్న తక్షణమే 8712584473 సెల్ నంబర్ కు సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్స్పెక్టర్స్ జె సురేష్, ఆర్ఐ శివ కేశవులు,ఆర్ఎస్ఐ పూర్ణ చంద్రా రెడ్డి,ఎస్ఐ చాంద్ పాషా,ఏఎస్ఐ సాంబయ్య మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com